E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 12-01-2026 (వారం) సోమవారం సంపుటి: 02 || సంచిక: 12|| పేజీలు–6 www.ekaburu.com



భారత్‌లో క్రిప్టో నిబంధనలు మరింత కఠినం

» 4లో

ఇక్కడా విరాటే..

» 6లో



కొత్త డీమ్యాట్ ఖాతాల కళ తగ్గింది

» 4లో



## సర్కారీ ఇంటర్‌నెట్‌ను

# వాడేదెప్పుడు

- » సొంత భవనాల్లోకి వెళ్లాకైనా వాడతారా!
- » ప్రభుత్వ ఆఫీసులకు నెట్ కోసం ఏడాదికి 450 కోట్లు
- » ప్రభుత్వ కార్యాలయాలన్నీ టీ ఫైబర్ ఇంటర్‌నెట్ కనెక్షన్ తీసుకోవాలని 2024 డిసెంబరు 8న జీవో
- » టీఫైబర్‌తో భూ భారతి లోపాలనూ కనిపెట్టే వీలు!
- » అయినా కనెక్షన్ తీసుకోని ప్రభుత్వ విభాగాలు
- » 5 శాతం శాఖలు కూడా స్పందించని వైనం



హైదరాబాద్, ఈకబురు : రాష్ట్ర ఖజానాకు భారంగా మారిన ఆర్థిక అంశాలపై దృష్టి సారించిన ప్రభుత్వం.. వాటిని ఒక్కొక్కటిగా నియంత్రించే చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రైవేటు భవనాల్లో అద్దెకు కొనసాగిస్తున్న ప్రభుత్వ విభాగాలను వెంటనే సొంత భవనాల్లోకి మారాలని ఆదేశించింది. తద్వారా ఏడాదికి రూ.800 కోట్ల వరకు ఆదా అవుతుందని ప్రభుత్వ వర్గాలు తేల్చాయి. కానీ, అద్దె భవనాలకు కిరాయి తోపాటు ఆయా కార్యాలయాలకు అవసరమైన ఇంటర్‌నెట్ కోసం కూడా అదే స్థాయిలో ప్రభుత్వ విభాగాలు ఖర్చు చేస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ/ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటు పరిధిలోని ఇంటర్‌నెట్‌నే వాడుతున్నాయి. ఇందుకోసం ఏడాదికి దాదాపు రూ.450 కోట్లు చెల్లిస్తున్నట్లు ప్రాథమిక అంచనాల్లో తేలిందని సమాచారం. స్టేట్ వైడ్ ఏరియా నెట్‌వర్క్ (స్వాన్) కింద 1,057 సంస్థలకు ఇంటర్‌నెట్ అందిస్తున్న ఓ కంపెనీకి ఏడాదికి రూ.38 కోట్లు చెల్లిస్తున్నట్లు తెలిసింది. కేవలం సచివాలయంలో నెట్ వినియోగానికే ఏడాదికి సుమారు రూ.8 కోట్లు ఖర్చవుతున్నట్లు సమాచారం. ఇలా భవనాల అద్దె రూ.800 కోట్లు, ఇంటర్‌నెట్ కోసం రూ.450 కోట్లు కలిపి ఏడాదికి రూ.1,250 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు తేలింది. అద్దె భవనాలు, ప్రైవేటు ఇంటర్‌నెట్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ఉన్నప్పటికీ.. 2020లో ప్రభుత్వ పరిధిలో ఇంటర్‌నెట్ అందుబాటులోకి వచ్చింది. భారత్‌నెట్ ఫేజ్ 2 కింద ఐటీ, పరిశ్రమల శాఖ పరిధిలోని 'తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ లిమిటెడ్' (టీఫైబర్) ద్వారా ప్రభుత్వం ఇంటర్‌నెట్‌ను అందిస్తోంది. 2020 నుంచి ఇది అందుబాటులో ఉన్నా.. ప్రభుత్వ సంస్థలు ఇప్పటి వరకు దీనిని వాడుకోవడంలేదు.

తరువాయి 2లో



## ఎస్సెల్బీసీ'లో సిబ్బందికి 25% అదనంగా వేతనాలు

హైదరాబాద్ ,ఈ-కబురు : శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్సెల్బీసీ) సొరంగం పనుల్లో విధులు నిర్వహించే నీటిపారుదల సిబ్బందికి 25 శాతం అదనంగా వేతనాలు అందించనున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎస్సెల్బీసీ, కాళేశ్వరం బ్యారేజీలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సెల్బీసీ నిర్మాణదారు పెండింగ్ బిల్లుల గురించి ప్రస్తావించినట్లు తెలిసింది. దీంతో మంత్రి అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇకపై చేపట్టే పనులకు సంబంధించి చెల్లింపులను గుత్తేదారు సంస్థ, నీటిపారుదలశాఖ కలిపి నిర్వహించే 'ఎస్క్రో' ఖాతాలో జమచేయాలని మంత్రి సూచించినట్లు తెలిసింది. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ..

తరువాయి 2లో



అన్ని వర్గాలను మోసం చేస్తున్నాడు: కేటీఆర్

» 3లో

## వనదేవతల వైభవాన్ని ప్రపంచానికి చాటుతాం

తాడ్వాయి,ఈ-కబురు : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మహా జాతరను విజయవంతంగా నిర్వహించి వనదేవతలు సమ్మక్క, సారలమ్మల వైభవాన్ని ప్రపంచానికి చాటుతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

» 2లో



## 16 నుంచి సీఎం మున్సిపల్ ప్రచారం



- » ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి శ్రీకారం
- » అదేరోజు సదర్‌మాట్ బ్యారేజీ ప్రారంభం
- » ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులకే సభల బాధ్యతలు!

హైదరాబాద్ ,ఈ-కబురు : సంక్రాంతి పండగ తరవాత మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ నెల 16న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పర్యటన ప్రారంభిస్తారు.

తరువాయి 2లో



కేరళలో భాజపా ప్రభుత్వ ఏర్పాటే అంతిమ లక్ష్యం: అమిత్ షా

» 3లో

## బానిస మనస్కులు సోమనాథ్ ప్రాధాన్యాన్ని విస్మరించారు



- ఆ చరిత్రను తుడిచేయాలని చూశారు
- ఆ శక్తులు ఇప్పటికీ ఉన్నాయి
- 'స్వాభిమాన్ పర్వ్'లో ప్రధాని మోదీ

**సోమనాథ్ : "చారిత్రక సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని వ్యతిరేకించిన శక్తులు ఇప్పటికీ మనమధ్య క్రియాశీలకంగా ఉన్నాయి. అప్రమత్తంగా, ఐక్యంగా ఉంటూ వాటిని ఓడించండి' అని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. పలుమార్లు ఈ ఆలయంపై దండెత్తినా ప్రతిసారీ పునర్నిర్మాణం జరిగిందని చెప్పారు. మెడపై కత్తిపెట్టి ప్రజల హృదయాలను ఎప్పటికీ గెలుచుకోలేరని స్పష్టంచేశారు. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన సోమనాథ్**

ఆలయంపై గజనీ మహమ్మద్ తొలిసారి దాడిచేసి వెయ్యేళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయన ఈ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' పేరుతో పెద్దఎత్తున జరిగిన వేడుకను ఉద్దేశించి ప్రసంగించారు. విధ్వంసం, ఓటమి కాకుండా విజయం, పునర్నిర్మాణంతో ఆలయ చరిత్ర ముడిపడి ఉందన్నారు. సోమనాథ్ ఆలయ చరిత్రను తుడిచిపెట్టేందుకు గత ప్రభుత్వాలు ప్రయత్నించాయని, బానిస మనస్తత్వం ఉన్నవారు ఆలయ ప్రాధాన్యాన్ని విస్మరించారని కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి విమర్శలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక ఆలయాన్ని పునర్నిర్మించడానికి ఉక్కుమనిషి సర్దార్ పటేల్ చేసిన ప్రయత్నాలను కొందరు అడ్డుకున్నారని విమర్శించారు. భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ ఈ పుణ్యక్షేత్రాన్ని సందర్శించాలని నిర్ణయించుకున్నప్పుడు అభ్యంతరాలు వ్యక్తంచేశారని ధ్వజమెత్తారు.

తరువాయి 2లో

## కోలుకున్న సోనియా గాంధీ

» ఆస్పత్రి నుంచి డిశ్చార్జి

» 2లో

అనారోగ్యం నుంచి కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ (79) కోలుకున్నారు. దాంతో ఆదివారం సాయంత్రం ఆమె సర్ గంగారాం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు.





బాలికపై సామూహిక లైంగిక దాడి

» కిడ్నాప్ చేసి మరీ ఘాతుకం

» 2లో



సినిమా హాల్లో కన్నా సచివాలయంలోనే పెద్ద సస్పెన్స్ థ్రిల్లర్: హరీశ్‌రావు

తరువాయి 2లో



## ఇరాన్‌పై దాడికి అమెరికా సన్నాహాలు

- » ఆందోళనలతో నెత్తురోడుతున్న ఇస్లామిక్ దేశం
- » 10 వేల మందికి పైగా అరెస్టు
- » నిరసనకారులపై సైన్యం ఉక్కుపాదం
- » అమెరికాకు ఇరాన్ తీవ్ర హెచ్చరికలు
- » అప్రమత్తమైన టెల్ అవీవ్
- » 538కి చేరిన మృతుల సంఖ్య

దుబాయ్: నిరసనలతో ఇరాన్ అట్టుడుకుతోంది. ఆందోళనకారుల్ని సైన్యం తీవ్రస్థాయిలో అణచివేస్తుండడంతో ఇరాన్ వీధులు నెత్తురోడుతున్నాయి. ఘర్షణల్లో మరణించిన వారి సంఖ్య ఆదివారం ఏకంగా 538కి చేరుకుంది. ఇందులో 48 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. దాదాపు 10,670 మందిని సైన్యం అరెస్టు చేసింది. మరోవైపు ఇరాన్‌పై సైనిక చర్య అవకాశాల్ని అమెరికా తీవ్రంగా పరిగణిస్తోందన్న వార్తలు పశ్చిమాసియావ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

తరువాయి 3లో

ఈ-కబురు
12- 01 -2026
సోమవారం
e-kaburu.com

## సర్కారీ ఇంటర్‌నెట్‌ను వాడేదెప్పుడు.

**జీవో జారీ చేసినా..**

ప్రభుత్వం ఖర్చు తగ్గించుకునే చర్యల్లో భాగంగా.. రాష్ట్రంలోని ప్రభుత్వ/ప్రభుత్వరంగ సంస్థలు, అర్బన్/రూరల్ లోకల్ బాడీలు సహా ఇతర ప్రభుత్వ అనుబంధ సంస్థలన్నీ 'టీఫైబర్' ఇంటర్‌నెట్ సేవలను తీసుకోవాలని ఆదేశిస్తూ 2024 డిసెంబరు 8న జీవో ఎంఎస్ నంబరు 9ని జారీ చేసింది. ప్రభుత్వ పరిధిలోని ఇంటర్‌నెట్ కోసం ఆయా శాఖలు, విభాగాల్లో ప్రత్యేకంగా నోడల్ అధికారులను కూడా నియమించాలని సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ/ప్రభుత్వరంగ సంస్థలు సహా మొత్తం 1,86,547 ప్రభుత్వ అనుబంధ విభాగాలు టీఫైబర్ ఇంటర్‌నెట్ వాడాలని ఆదేశించింది. కానీ, ఆ ఉత్తర్వులు కాగితాలకే పరిమితమయ్యాయి. ఇప్పటివరకు 5 శాతం ప్రభుత్వ సంస్థలు కూడా ఈ కనెక్షన్ తీసుకోలేదని తెలుస్తోంది. కాగా, ప్రైవేటు భవనాల్లో అద్దెకు కొనసాగుతున్న ప్రభుత్వ విభాగాలన్నీ.. త్వరలో సొంత భవనాల్లోకి వెళ్లనున్న నేపథ్యంలో అప్పుడైనా సర్కారీ ఇంటర్‌నెట్‌ను వినియోగిస్తారా, లేదా అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మండలాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని ప్రభుత్వ సంస్థలు సొంత భవనాల్లోకి వెళ్తున్న క్రమంలో టీఫైబర్ ఇంటర్‌నెట్‌నే వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. తద్వారా ఇంటర్‌నెట్ వినియోగం కోసం ప్రస్తుతం చేస్తున్న ఖర్చులో కొంతైనా తగ్గుతుతుందని భావిస్తున్నట్లు సమాచారం.



## బానిస మనస్కులు సోమనాథ్ ప్రాధాన్యాన్ని విస్మరించారు

**భారత అస్తిత్వానికి ప్రతీక**

"1,000 ఏళ్ల క్రితం దురాక్రమణదారులు ఈ ఆలయాన్ని ధ్వంసం చేసి విజయం సాధించామని అనుకున్నారు. ఔరంగజేబ్ అయితే ఆలయాన్ని ఆక్రమించుకుని మసీదు కడదామనుకున్నాడు. అవన్నీ చరిత్రపుటల్లో కలిసిపోయినా ఇప్పటికీ ఆలయంపై జెండా ఎగురుతూనే ఉంది. చరిత్రలో ఇలాంటి ఉదంతం మరొకటి లేదు. భారత అస్థిత్వానికి, గౌరవానికి సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ ప్రతీక. ఒకవేళ ఆలయ సంపద కోసమే అయితే సోమనాథ్‌పై మొదటిసారి జరిగిన దాడి సరిపోయేది. అలా కాకుండా ఆలయంపై పదేపదే దాడులతో దైవాన్ని అపవిత్రం చేశారు. ద్వేషం, అరాచకం, భయపెట్టేయత్నాలపై అసలు నిజాలను దాచిపెట్టి.. సంపద కోసమే సోమనాథ్‌పై దాడి జరిగినట్లు చిత్రీకరించారు. తమ మతానికి నిజంగా కట్టుబడినవారు ఇలాంటి అతివాద సైద్ధాంతికతకు మద్దతు ఇవ్వరు. కానీ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడినవారు మాత్రం అలాంటి అతివాదుల ముందు మోకరిల్లారు. ఆనాడు ఆలయ పునర్నిర్మాణాన్ని వ్యతిరేకించినవారు మనలోనే ఉంటూ కత్తుల బదులు కుట్రలతో విరుచుకుపడుతున్నారు. ఇలాంటి విభజనశక్తులపై అప్రమతంగా ఉండాలి" అని మోదీ పిలుపునిచ్చారు.

**వాహనశ్రేణి వెంట 108 అశ్వాలు.. డమరుకం మోగించిన మోదీ**

శౌర్యయాత్రలో నిర్వహించిన కార్యక్రమాలు కట్టిపడేశాయి. ఆలయాన్ని రక్షించే క్రమంలో ప్రాణాలు అర్పించిన యోధులకు నివాళిగా ఈ యాత్ర నిర్వహించారు. మోదీ వాహనశ్రేణి వెంట వచ్చిన 108 అశ్వాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో యాత్రలో పాల్గొన్న ఆయన, మధ్యలో డమరుకం మోగించారు. ఆలయంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. దాదాపు కిలోమీటరు మేర సాగిన ఈ యాత్రలో భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు. హరహర మహాదేవ్ నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.



## బాలికపై సామూహిక లైంగిక దాడి



**తిరువొత్తియూరు ,ఈ-కబురు : ఓ పాఠశాల విద్యార్థినిపై నలుగురు మైనర్లు సామూహిక అత్యాచారం చేసిన ఘటన పుదుచ్చేరిలోని బాగూరులో జరిగింది. పుదుచ్చేరికి చెందిన 14 ఏళ్ల బాలిక అక్కడి ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కొద్ది రోజుల క్రితం పాఠశాలకు వెళ్లిన బాలిక ఇంటికి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు పలుచోట్ల గాలించినప్పటికీ ఆచూకీ తెలియలేదు.**

**ఈ క్రమంలో బాలిక బాగూరు ప్రాంతంలో ఉన్నట్లు తల్లిదండ్రులకు సమాచారం అందింది. దాని ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. 'ప్రేమిస్తున్నానంటూ ఓ బాలుడు విద్యార్థినిని కిడ్నాప్ చేసి, ఓ ఇంట్లో బంధించాడని, అక్కడ మరో ముగ్గురు స్నేహితులతో కలిసి బాలికపై అత్యాచారానికి ఒడిగట్టారని పోలీసులు తెలిపారు. విద్యార్థినిని రక్షించి, నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.**

## వనదేవతల వైభవాన్ని ప్రపంచానికి చాటుతాం



ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఉత్సవాల ఏర్పాట్లు, గద్దెల పునర్నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు ఆదివారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి ఆయన మేడారాన్ని సందర్శించారు. స్థానిక హరిత హోటల్‌లో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో భట్టి మాట్లాడుతూ రూ.251 కోట్లు వెచ్చించి గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. రెండ్రోజుల్లో పనులన్నీ పూర్తవుతాయన్నారు.

మొదటి పేజీ తరువాయి

## సినిమా హాల్లో కన్నా సచివాలయంలోనే పెద్ద

హైదరాబాద్: రాష్ట్రంలో ఒకవైపు సినిమా టికెట్ ధరలు పెంచుతూ జీవో బయటికి వస్తే.. మరోవైపు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆ విషయంలో తన ప్రమేయం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందని, సినిమా థియేటర్లలో కన్నా సచివాలయంలోనే పెద్ద సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా నడుస్తోందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'సాక్షాత్తు క్యాబినెట్ మంత్రికి తెలియకుండానే ఆయన శాఖలో ఇంత పెద్ద నిర్ణయం జరిగిపోతుంటే అసలు ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది ఎవరు? టికెట్ రేట్ల పెంపు విషయంలో హైకోర్టు మొట్టికాయలు వేసినా ఈ ప్రభుత్వ తీరు మారకపోవడం శోచనీయం. సినిమా టికెట్ రేట్ల పెంపు ఉండదని, బెనిఫిట్ షోలు ఉండవని అసెంబ్లీ సాక్షిగా రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మరి ఇప్పుడు రాత్రికి రాత్రే జీవోలు ఎలా వచ్చాయి? ఇప్పటికే మూడు సినిమాలకు అడ్డగోలుగా రేట్లు పెంచుతూ జీవోలు ఇచ్చారు. నేడో రేపో మరో సినిమాకు కూడా జీవో ఇవ్వడానికి సిద్ధమయ్యారు. సీఎం పేరు మర్చిపోయినందుకు ఒక నటుడిని జైలుకు పంపించారు. సినిమా టికెట్ రేట్ల దందాపై గవర్నర్ దృష్టి సారించాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.



## కోలుకున్న సోనియా గాంధీ



**అనారోగ్యం నుంచి కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ (79) కోలుకున్నారు. దాంతో ఆదివారం సాయంత్రం ఆమె సర్ గంగారాం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఆస్త్మా, చెస్ట్ ఇన్‌ఫెక్షన్ ఇతర సమస్యల కారణంగా ఈ నెల అయిదో తేదీన ఆమె ఆ ఆస్పత్రిలో చేరారు. వారం రోజుల పాటు చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ అరుప్ బసు ఆమెకు చికిత్సలు అందించారు. కోలుకోవడంతో ఆమెను డిశ్చార్జి చేశామని, ఇంటి వద్దే వైద్యం చేయించుకోవాలని సూచించామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.**

## ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్.. వైబ్రంట్ గుజరాత్ సదస్సులో మోదీ

ప్రపంచ అనిశ్చితి మధ్య భారతదేశం అపూర్వమైన నిశ్చయత దశను చూస్తోందని పరోక్షంగా బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకలో ఇటీవల రాజకీయ కల్లోలాలను ప్రస్తావిస్తూ మోదీ పేర్కొన్నారు.
రాజ్‌కోట్: భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా దూసుకెళ్తోందని, దేశంలో ద్రవ్యోల్బణం అదుపులో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ (Narendra Modi) అన్నారు. ప్రపంచ అనిశ్చితి మధ్య భారతదేశం అపూర్వమైన నిశ్చయత దశ (unprecedented certainty)ను చూస్తోందని పరోక్షంగా బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకలో ఇటీవల రాజకీయ కల్లోలాలను ప్రస్తావిస్తూ పేర్కొన్నారు. రాజ్‌కోట్‌లో ఆదివారం నాడు జరిగిన వైబ్రంట్ గుజరాత్ రీజినల్ కాన్ఫరెన్స్ ఫర్ కచ్ అండ్ సౌరాష్ట్ర రీజియన్‌లో ప్రధాని మాట్లాడుతూ, 'రిఫార్మ్, పర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్' అనే విజయ మంత్రమే భారతదేశ వృద్ధిని ప్రతిబింబిస్తోందన్నారు. మౌలిక వసతుల కల్పనతోపాటు ఇండస్ట్రీరెడీ వర్క్‌ఫోర్స్ అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు గ్రోత్ ఇంజన్‌లా గుజరాత్ మారిందని, కచ్, సౌరాష్ట్ర ప్రాంతాలు అవకాశాలకే పరిమితం కాకుండా దేశ ప్రగతికి బలమైన పునాదిగా మారాయని ప్రశంసించారు.
'భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ద్రవ్యోల్బణం అదుపులో ఉంది. వ్యవసాయ ఉత్పత్తులు సరికొత్త రికార్డులు సృష్టించాయి. పాల ఉత్పత్తిలో నెంబర్ వన్ రికార్డు మనదే. వ్యాక్సిన్ల అతి పెద్ద ఉత్పత్తిదారు కూడా ఇండియానే. గత 11 ఏళ్లలో ప్రపంచంలోనే అతి పెద్ద మొబైల్ డేటా వినియోగదారుగా కూడా ఇండియా నిలిచింది' అని ప్రధాని తెలిపారు.
మూడురోజుల పర్యటనలో భాగంగా శనివారం నాడు గుజరాత్‌లోని సోమనాథ్‌కు వచ్చిన ప్రధాని ఆదివారం నాడు స్వాభిమాన్ పర్వ్‌లో భాగంగా శౌర్య యాత్రలో పాల్గొన్నారు. సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దీనికి ముందు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు.

## 16 నుంచి సీఎం మున్సిపల్ ప్రచారం



మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా బహిరంగసభలో ప్రసంగిస్తారు. అదేరోజు సదర్‌మాట్ బ్యారేజీ ప్రారంభోత్సవంతో పాటు, చనాఖాకోర్టా ప్రాజెక్టు సందర్శన, సభ ఉంటుందని కాంగ్రెస్ పార్టీవర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమాలతోనే మున్సిపల్ ఎన్నికల ప్రచారాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. వాస్తవానికి ఫిబ్రవరి 3న జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభతో ప్రచారం ప్రారంభించాలని అనుకున్నా సమయం సరిపోదని.. అంతకన్నా ముందే జరపాలని తాజాగా నిర్ణయించారు.

**శంకుస్థాపనలు.. సభలు..**

**ఈ నెల 17న జడ్చర్లలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి, మహబూబ్‌నగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన చేసి, ఇదే పట్టణంలో ఏర్పాటుచేసే బహిరంగసభలో ప్రసంగించనున్నారు.**

18న పాలేరులో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనల అనంతరం ఖమ్మం పట్టణంలో నిర్వహించే ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తారు. అనంతరం అక్కడే సీపీఐ వందేళ్ల సభలో పాల్గొంటారు. అదేరోజు సాయంత్రం ములుగు జిల్లా మేడారం చేరుకుని, అక్కడ రాత్రి బస చేస్తారు.

19న ఉదయం 6.30 గంటలకు కొత్తగా నిర్మించిన సమ్మక్కసారలమ్మ గద్దెలను సీఎం ప్రారంభించి మొక్కులు తీర్చుకుని హైదరాబాద్ చేరుకుంటారు. అదేరోజు సాయంత్రం దావోస్‌కు బయలుదేరి వెళతారు. అక్కడినుంచి 25న అమెరికా వెళతారని తెలుస్తోంది. ఫిబ్రవరి ఒకటో తేదీన రేవంత్ తిరిగి హైదరాబాద్‌కు వస్తారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఈ కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించలేదు.

ఒక్కోచోట లక్ష మందితో సభ: ఫిబ్రవరి 3 నుంచి మళ్లీ ఉమ్మడి జిల్లాల్లో వరసగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సభలు ఏర్పాటు చేయనున్నారు. మున్సిపల్ ఎన్నికలకు హైదరాబాద్ మినహా మిగిలిన 9 ఉమ్మడి జిల్లాల్లో ఒక్కోచోట లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలనేది కాంగ్రెస్ ప్రచార వ్యూహం. ఈ సభలను విజయవంతం చేయడానికి ఒక్కో లోక్‌సభ నియోజకవర్గం లేదా ఒక ఉమ్మడి జిల్లా పర్యవేక్షణ బాధ్యతలను ఒక్కో మంత్రికి అప్పగించాలని సీఎం ఇప్పటికే సూచించారు. ఈ మేరకు ఏ జిల్లాకు ఏ మంత్రి అనేది పార్టీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. లోక్‌సభ నియోజకవర్గాలకు కాకుండా.. ఉమ్మడి జిల్లాలకు ప్రస్తుతం ఇన్‌ఛార్జి మంత్రులుగా ఉన్నవారికే సభల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలనే యోచనలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) ఉన్నట్లు సమాచారం. పీసీసీ రూపొందించిన ప్రతిపాదనలపై ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించిన తరవాత మంత్రుల జాబితాను విడుదల చేస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం వార్డులు, ఛైర్మన్ పదవులు గెలవాలనే లక్ష్యంతో సభలు, ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## ఎస్సెల్బీసీ'లో సిబ్బందికి 25% అదనంగా వేతనాలు



**ఎస్సెల్బీసీ సొరంగంలో టీబీఎం స్థానంలో ఆధునిక సాంకేతిక పద్ధతిలో తవ్వకాలు నిర్వహిస్తామని తెలిపారు. మిగిలిన 9.8 కి.మీ. పనులు పూర్తిచేసి ఫ్లోరైడ్ పీడిత నల్గొండ జిల్లాకు నీళ్లు ఇస్తామన్నారు. గత భారాస ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఈ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యం చేయడంతో పూర్తికాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పూర్తిచేస్తామని పునరుద్ఘాటించారు. పనులు పూర్తిచేసేందుకు క్షేత్రస్థాయిలో నియామకాలు చేపట్టి, 24 గంటల ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు లెఫ్టినెంట్ కర్నల్ హర్పాల్ సింగ్, ఆదిత్యనాథ్ దాస్, సొరంగాల నిపుణుడు పరీక్షిత్ మెహ్రా, నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అంజద్, సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు పునరావాస డిజైన్లపై చర్చించినట్లు తెలిసింది. పునరావాస డిజైన్లకు ఐదు సంస్థలు ఆసక్తి వ్యక్తీకరించాయి. వాటిలో చివరికి ఆఫ్రీ సంస్థను ఖరారు చేసినట్లు తెలిసింది.**

# ఇరాన్‌పై దాడికి అమెరికా సన్నాహాలు

యుద్ధమేఘాలూ అలముకుంటున్న సంకేతాలని స్తున్నాయి. ఈ ఆందోళనలకు సంబంధించి ఇరాన్, అమెరికా మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. ఆందోళనకారులకు ఏమైనా జరిగితే తాము రంగంలోకి దిగుతామని పదే పదే హెచ్చరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైనిక చర్య దిశగా సన్నాహాలు చేస్తున్నారని మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. సైనికాధికారులు ఇప్పటికే అధ్యక్షుడితో చర్చించారని సమాచారం. ఇరాన్‌పై చర్య విషయంలో వివిధ ప్రతిపాదనలు ట్రంప్ ముందున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇందులో అమెరికా నేరుగా జోక్యం చేసుకోకుండా పరోక్షంగా రంగంలోకి దిగేందుకు వీలైన సూచనలూ ఉన్నాయి. ఈ ప్రతిపాదనలపై ట్రంప్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ఓ అధికారి తెలిపారు. మృతుల సంఖ్య పెరిగితే మాత్రం ఆయన తీవ్ర చర్యలు తీసుకొనే అవకాశం ఉందని అన్నారు.



**ఉగ్ర మూకలు దేశాన్ని నాశనం చేస్తున్నాయి**

ఆందోళనకారులను ఉగ్రవాదులతో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ పోల్చారు. ఈ మూకలు సమాజాన్నే నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. అదే సమయంలో ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను పరిష్కరించటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. దేశాన్ని అస్థిరపరిచేందుకు ఇజ్రాయెల్, అమెరికా కుట్ర పన్నుతున్నాయని అన్నారు "ప్రజల సమస్యలను పరిష్కరించడం మా కర్తవ్యం. అంతకంటే ముందు అల్లరి మూకలు మొత్తం సమాజాన్ని నాశనం చేయకుండా చూడాలి'' అని అధికారిక మీడియా ఇంటర్వ్యూలో పెజెష్కియాన్ తెలిపారు. ఇరాన్ ప్రజలు స్వేచ్ఛ కోసం పరితపిస్తున్నారని, వారికి అండగా ఉంటామని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమమైన 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ శాఖ కూడా కీలక ప్రకటన విడుదల చేసింది. "ట్రంప్‌తో ఆటలాడకండి. ఆయన చెప్పారంటే ఏదో చేస్తారు'' అని ఇరాన్‌ను హెచ్చరించింది.

**ఇజ్రాయెల్‌ను లక్ష్యం చేసుకుంటాం..**

ట్రంప్ ప్రకటనపై ఇరాన్ పార్లమెంటు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'అమెరికాకు మరణం' అంటూ సభ్యులు నినాదాలు చేశారు. పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బాకర్ గాలిబాఫ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమెరికా తమపై దాడి చేస్తే తాము ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలనూ నాశనం చేస్తామని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో ఇజ్రాయెల్ అప్రమత్తమైంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో సంభాషించారు. ఇరాన్‌లో ప్రజా ఆందోళనలు, సిరియా, గాజాలో పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. ధైర్యవంతులైన ఇరాన్ ప్రజలకు అమెరికా మద్దతు ఉంటుందని సోషల్ మీడియాలో రూబియో ఓ పోస్టు పెట్టారు.

ఇరాన్ ఆందోళనలు విదేశాలకు సైతం వ్యాపించాయి. లండన్‌లో ఇరాన్ రాయబార కార్యాలయం వద్ద నిరసనలు జరిగాయి. ఎంబసీ బాల్కనీపైకి ఎక్కి ఇస్లామిక్ రిపబ్లిక్ జెండాను తొలగించిన ఆందోళనకారులు, దాని స్థానంలో 1979 నాటి దేశ పతాకాన్ని ఎగురవేశారు. పారిస్, బెర్లిన్ సహా ఐరోపాలోని ప్రధాన నగరాల్లో సంఘీభావ ర్యాలీలు జరిగాయి.

# యమపాశంగా మారుతున్న చైనా మాంజా



కొండాపూర్ లో చైనా మాంజా కారణంగా గాయపడిన సూర్యతేజ





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం



ఉప్పల్ లో గాయపడిన సాయి వర్ధన్ రెడ్డి

**కొండాపూర్ ఫ్లైఓవర్ మీద వాహనదారుడి చేతికి చుట్టుకున్న మాంజా**

**ప్రైవేటు ఉద్యోగికి తీవ్ర గాయాలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : నిషేధిత చైనా మాంజా నగరంలో ద్విచక్ర వాహనదారుల పాలిట యమపాశంగా మారుతుంది. రోడ్డు మీద వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనదారులు చైనా మాంజా కారణంగా గాయాలకు గురై ఆసుపత్రి పాలవుతున్నారు. ఇప్పటివరకు పక్షుల ప్రాణాలనే బలి తీసుకున్న చైనా మాంజా ప్రస్తుతం వాహనదారులకు సైతం ప్రాణసంకటంగా మారుతుంది. నగరంలో చైనా మాంజా కారణంగా మరో వ్యక్తి ఆసుపత్రి పాలయ్యాడు. ఉద్యోగం ముగించుకొని ఇంటికి బైక్ మీద వెళ్తున్న ఓ ప్రైవేటు ఇన్సూరెన్స్ ఉద్యోగిని చైనా మాంజా ప్రమాదంలోకి నెట్టింది. చైనా మాంజా చేతికి చుట్టుకొని ఓ ఇన్సూరెన్స్ ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం క్షతగాత్రుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా పెద్దవాల్తేరు పరిధిలోని విజయనగర్ కాలనీకి చెందిన కుందుం సూర్యతేజ(33) ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చాడు. మియాపూర్ పరిధిలోని ఎస్ఆర్ ఎస్టేట్ బ్లాక్ నెంబరు 4లో గల ఫ్లాట్ నెంబరు 401లో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా ఆదివారం మధ్యాహ్నం ఉద్యోగం ముగించుకొని తన ద్విచక్రవాహనం మీద గచ్చిబౌలి వైపు నుంచి మియాపూర్ కు వస్తున్నాడు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో కొండాపూర్ ఫ్లైఓవర్ మీద బొటానికల్ గార్డెన్ వద్దకు రాగానే చైనా మాంజా ఒక్కసారిగా గాలిలో వేలాడుతూ సూర్యతేజ చేతికి చుట్టుకుంది. వాహనం మీద వెళ్తున్న సూర్యతేజ చేతిని మాంజా కోయడంతో ఎడుమ భుజానికి తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికుల సహాయంతో స్నేహితులకు సమాచారం అందించగా, వారు సంఘటనా స్థలికి చేరుకొని సూర్యతేజను మాదాపూర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సూర్యతేజకు ఆసుపత్రులు శాస్త్ర చికిత్స నిర్వహించగా 14 కుట్లు పడినట్లు తెలిసింది. ప్రస్తుతం సూర్యతేజ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

**ఉప్పల్ లో మరో ఘటన...**

నగరంలోని ఉప్పల్ లో చైనా మాంజా బాధితుడి ఘటన మరొకటి వెలుగు చూసింది. ద్విచక్ర వాహనం మీద వెళ్తున్న సాఫ్ట్వేర్ ఉద్యోగి చైనా మాంజా మెడకు బిగుసుకోవడంతో గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నగరంలో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న సాయి వర్ధన్ రెడ్డి ఆదివారం తన ద్విచక్ర వాహనం మీద హబ్సిగూడ ఉప్పల్ రోడ్డులో ప్రయాణిస్తున్నాడు. మార్గ మధ్యలో ఉప్పల్ స్టేడియం మెట్రో స్టేషన్ సమీపంలో బైక్ మీద వెళ్తున్న సాయి వర్ధన్ రెడ్డి మెడకు చైనా మాంజా చుట్టుకుపోయింది. దీంతో సాయి వర్ధన్ రెడ్డి మెడ మీద లోతైన గాయం కావడంతో స్థానికులు అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. చైనా మాంజా కారణంగా నగరంలో రోజురోజుకు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతుండడంతో చైనా మాంజా విక్రేతల సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. చైనా మాంజాను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మన సంస్కృతికి ప్రతీక పండుగలు : కొమిరిశెట్టి సాయిబాబా



పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం



శారదా స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న రాధాకృష్ణ యాదవ్

**కొండాపూర్ లో సంక్రాంతి ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రధానం**

ఈకబురు, శేరిలింగంపల్లి : పండుగలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ డివిజన్ లోని ప్రేమ్ నగర్ బి బ్లాక్ లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అల్లా ఉద్దీన్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆదివారం చందానగర్ మాజీ కార్పొరేటర్ నవతా రెడ్డి, శేరిలింగంపల్లి సీనియర్ నాయకులతో కలిసి కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు గెలుపొందిన మహిళలకు కొమిరిశెట్టి సాయిబాబా చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సాయిబాబా మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటేనే మహిళల రంగురంగుల రంగవల్లులు గుర్తుకు వస్తాయని అన్నారు. ప్రతిరోజు ఉదయం ఇంటిముందు కల్లాపి చల్లి ముగ్గులు వేయడం అనాదిగా వస్తున్న సాంప్రదాయమన్నారు. ముగ్గులు వేయడంలో మహిళల సృజనాత్మక శక్తి ప్రదర్శించడంతో పాటు శారీరక వ్యాయామం ఏర్పడుతుందని తెలిపారు. నేటి తరానికి రంగవల్లులను పరిచయం చేసేందుకు ఇటువంటి ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మిద్దెల మల్లారెడ్డి , రవి యాదవ్ ,శ్రీనివాస్ గౌడ్ , పార్నంది శ్రీకాంత్ , షాంలెట్ శ్రీనివాస్ దారుగుపల్లి నరేష్, పెద్దగోని రమేష్ గౌడ్ , చారి , లావణ్య , కమల ,సరితా ,సల్మాన్ ,శిరీన్ బేగం , దశరథ్ , షబ్బీర్ , మహబూబ్ లతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## కేరళలో భాజపా ప్రభుత్వ ఏర్పాటే అంతిమ లక్ష్యం: అమిత్ షా

తిరువనంతపురం: కేరళలో భారతీయ జనతా పార్టీ(భాజపా) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. నూతనంగా ఎన్నికైన భాజపా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ఆదివారం ఏర్పాటుచేసిన సభలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. వచ్చే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం చేపట్టిన 'మిషన్ 2026' కార్యక్రమాన్ని అమిత్ షా ప్రారంభించారు. "కేరళలో భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చేయడమే మన లక్ష్యం. దేశ వ్యతిరేక శక్తుల నుంచి కేరళను రక్షించడంతో పాటు శతాబ్దాలుగా రాష్ట్రంలో ఉన్న నమ్మకాల్ని కాపాడేందుకు కృషిచేయాలి. ఈ మూడింటిని యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్‌లు పూర్తి చేయలేవని, నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయేతోనే ఇది సాధ్యం'' అని అమిత్ షా పేర్కొన్నారు.

**తటస్థ దర్యాప్తు సంస్థతో విచారణ చేపట్టాలి..**

శబరిమల బంగారం తాపడాల కేసు విషయంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై అమిత్ షా తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ కేసు విచారణను తటస్థ దర్యాప్తు సంస్థ చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శబరిమల ఆలయంలోని ఆస్తులను కాపాడడంలో విఫలమైన వారు ప్రజల నమ్మకాన్ని ఎలా కాపాడతారని ప్రశ్నించారు. "శబరిమల బంగారం చోరీ సమస్య కేవలం కేరళ ప్రజలది మాత్రమే కాదు. దేశవ్యాప్తంగా ఉన్న భక్తులందరిది. ఈ కేసులో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను గమనిస్తే.. నిందితులను రక్షించేందుకే రూపొందించినట్లుగా ఉంది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టడమే కాదు. ఇంటింటికీ ప్రచార కార్యక్రమాలు చేపడతాం'' అని అమిత్ షా మండిపడ్డారు. రాష్ట్రంలోని శాంతి భద్రతలు ప్రస్తుతం ప్రశాంతంగా కనిపించొచ్చు కానీ, భవిష్యత్తులో ప్రమాదకరంగా మారే పలు సంఘటనలు బయటపడుతున్నాయని ఆయన హెచ్చరించారు.



మొదటి పేజీ తరువాయి

# బ్రిటీష్ వారిని గడగడలాడించిన యోధుడు వడ్డే ఓబన్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



)సమావేశంలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న వడ్డెర సంఘం నాయకులు

**వడ్డే ఓబన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

ఈకబురు, శేరిలింగంపల్లి : బ్రిటీష్ వారిని గడగడలాడించిన యోధుడు వడ్డే ఓబన్న అని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న జయంతిని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి కేశవ నగర్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో కలిపి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర పోరాటంలో వడ్డే ఓబన్న చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెరల ముద్దు బిడ్డ ,స్వాతంత్ర్య సమరయోధులు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న 219వ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. సిపాయిల తిరుగుబాటుకు ముందే బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన విప్లవ వీరుడు వడ్డే ఓబన్న అని అన్నారు. దేశం కోసం పోరాడిన తొలి స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యానికి వడ్డే ఓబన్న వెన్నెముకలా నిలిచారని తెలిపారు. ఆయన పోరాట జీవితం యువతకు ఆదర్శం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సోదరులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలను మోసం చేస్తున్నాడు: కేటీఆర్



ఈకబురు హైదరాబాద్/బండ్లగూడ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిజాయితీ కలిగిన మోసగాడు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మోసం చేసేవారికే ప్రజలు అధికారం కట్టబెడతారని ముందే చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు సరిగ్గా తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని చెప్పారు. రెట్టింపు పెన్షన్లు, రైతుబంధు, దళితబంధు, రెండు లక్షల ఉద్యోగాలు, పీఆర్సీ ఇలా అనేక కార్యక్రమాలను ప్రకటించి, ఒక్కటీ అమలు చేయడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి రైతులు, రైతు కూలీలు, కౌలుదారులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇలా అందరిని మోసం చేశారని కేటీఆర్ అన్నారు. రేవంత్‌కు తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్ భాషలు రావు కానీ ఆయనకు వచ్చిన ఏకైక భాష బూతుల భాష అని ఎద్దేవా చేశారు.

బండ్లగూడ మాజీ మేయర్ లతాప్రేమ్‌గౌడ్, వారి అనుచరులు ఆదివారం తెలంగాణభవన్‌లో కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'కేసీఆర్ కనిపిస్తే ధైర్యం వస్తది అని ప్రజలు అనుకుంటున్నారు. రాష్ట్రంలో వ్యాపారాలు తగ్గడానికి, పరిస్థితులు దిగజారడానికి సన్నాసి రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కారణం. కాంగ్రెస్‌లో చేరిన ఫిరాయింపు ఎమ్మెల్యేల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఏమి అభివృద్ధి చూసి కాంగ్రెస్‌లో చేరిండో నియోజకవర్గ ప్రజలకు చెప్పాలి'అని కేటీఆర్ అన్నారు.

**బీజేపీ బలం గాలివాటమే**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి బీజేపీ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 24 నెలల కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనకు, గత పది సంవత్సరాల్లో జరిగిన అద్భుతమైన అభివృద్ధికి మధ్య ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని, కచ్చితంగా మరోసారి బీఆర్ఎస్ వైపు నిలిచేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఆదివారం ఆదిలాబాద్, మెదక్ జిల్లాల అధ్యక్షులు, పార్టీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులతో జరిగిన పురపాలక ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రెండు జిల్లాల్లో పార్టీ అనుసరించాల్సిన మున్సిపల్ ఎన్నికల వ్యూహం, ఇతర అంశాలపై కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పురపాలక ఎన్నికల్లో సమష్టిగా కలిసి కొట్లాడి కాంగ్రెస్‌పై ఘన విజయం సాధించేలా ప్రయత్నం చేయాలని సూచించారు. బీజేపీకి క్షేత్రస్థాయిలో బలం లేదని, జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మొదలు సర్పంచ్‌ల వరకు ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్ వైపు ప్రజలు నిలబడ్డారన్నారు. రాష్ట్రంలో రెండు సంవత్సరాల కింద జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయం గాలివాటమే అని చెప్పారు. ఆనాడు దేశంలోని రాజకీయ పరిస్థితులతోనే బీజేపీ గెలిచిందే తప్ప, ఆ పార్టీకి తెలంగాణలో క్షేత్రస్థాయి బలం లేదన్నారు. అసెంబ్లీలో పోటీచేసిన ప్రతి ఒక్క బీజేపీ సీనియర్ నేతలు ఘోరమైన ఓటమి పాలయ్యారని, పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం గాలివాటంగా గెలిచారని చెప్పారు. ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లోని మున్సిపాలిటీలలో ఉన్న స్థానిక పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఈ సమావేశంలో పాల్గొని అనేక అంశాలపై పార్టీ శ్రేణులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

# 'వీబీజీ రామ్‌జీ' చట్టం పారదర్శకతకు ప్రతీక

హైదరాబాద్: భారతదేశంలో ఉపాధి హామీ పథకాలు 1960ల నుంచే అమలులో ఉన్నప్పటికీ, వాటిలో నిర్మాణాత్మక లోపాలు ఉన్నాయని, అవినీతిమయంగా మారాయని, అందుకే కేంద్రం పారదర్శకంగా 'వీబీజీ రామ్‌జీ' చట్టాన్ని పేదల కోసం తీసుకొచ్చిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కార్యశాల జరిగింది. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. "ఇప్పటి వరకు ఉన్న చట్టాల్లో లోపాలను సరిదిద్దేందుకు కేంద్రం ఆధునిక సాంకేతికతతో వీబీజీ రామ్‌జీ పథకాన్ని తీసుకొచ్చింది.2047 నాటికి దేశం వికసిత్ భారత్‌గా మారే దిశగా దృఢంగా ముందుకెళ్తోంది. భారత్ నేడు 4వ ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. త్వరలోనే ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతోంది. ఇందుకు అనుగుణంగా పాత సంక్షేమ నమూనాల్లో మార్పులు అవసరమని కేంద్రం కొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. మహాత్మా గాంధీ పేరు మార్చారని కాంగ్రెస్ అభ్యంతరం చెబుతోంది. మరి హైదరాబాద్ విమానాశ్రయానికి మహాత్మా గాంధీ పేరు ఎందుకు పెట్టలేదు?'' అని రామచందర్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా జాతీయ కార్యదర్శి ఓం ప్రకాష్ ధన్ కర్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. గౌతమ్ రావు, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఔషధ కంపెనీలకు ఊరట

**–చిన్న ఉల్లంఘనలకు కోర్టులకు హాజరు కానక్కర్లేదు!**
**–డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ చట్టానికి సవరణలు**



'కొన్ని చిన్న ఉల్లంఘనల' విషయంలో ఫార్మాస్యూటికల్ కంపెనీలు ఇకపై కోర్టులకు హాజరు కానవసరం లేదని తాజాగా సవరించిన మార్గదర్శకాలను ఉటంకిస్తూ విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దీనికి బదులు వారు షరతులకు లోబడి నగదు జరిమానా చెల్లించవచ్చు. అలాగే స్వీయ దిద్దుబాటు చర్యలు తీసుకోవచ్చు. 1940 నాటి డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ చట్టంతో పాటు వివిధ చట్టాల్లోని చిన్న నేరాలను డీక్రిమినలైజ్ చేశారు. వ్యాపారాన్ని సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకున్న జన్ విశ్వాస్ చట్టం కింద ప్రవేశపెట్టిన డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ (కాంపౌండింగ్ ఆఫ్ అఫెన్సెస్) 2025 ద్వారా మార్గదర్శకాల్లో మార్పులు తెచ్చారు. ఈ చట్టం దేశంలో మందులు, కాస్మటిక్స్, వైద్య పరికరాల భద్రత, సామర్థ్యం, నాణ్యతను నిర్ధారిస్తుంది. ఈ చట్టాన్ని సక్రమంగా పాటించకపోతే విచారణకు దారి తీయవచ్చు. అయితే న్యాయ వ్యవస్థపై ఎక్కువ భారం పడకుండా చిన్న, సాంకేతిక ఉల్లంఘనలను పరిష్కరించాల్సిన అవసరాన్ని గుర్తించి, నేరాలను సమ్మిళితం చేయడానికి సెక్షన్ 32బి ప్రవేశపెట్టారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కింద పని చేస్తున్న సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) 'నేరాల సమ్మేళనం' అనే కొత్త ప్రక్రియను వివరిస్తూ, డ్రగ్స్ అండ్ కాస్మటిక్స్ (నేరాల సమ్మేళనం) నిబంధనలు 2025ను రూపొందించింది. అయితే వీటిల్లో జరిమానా మొత్తం ఎంతనేది పేర్కొనలేదు. అలాగే నేరాలను కూడా వెల్లడించలేదు

# విక్రయాల ఒత్తిడి తప్పదా?

***–నేడు టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ ఫలితాలు***
***–బ్యాంకింగ్, వాహన షేర్లు రాణించొచ్చు***
***–విశ్లేషకుల అంచనాలు***




భారత స్టాక్ మార్కెట్లు సమీప కాలంలో బలహీనంగా కదలాడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రష్యా చమురును దిగుమతి చేసుకునే దేశాలపై అమెరికా టారిఫ్‌లపై అనిశ్చితి ఇందుకు నేపథ్యంగా చెబుతున్నారు. రష్యా చమురును కొంటున్న దేశాలపై 500% పన్ను విధించేందుకు వీలుకల్పించే ఒక బిల్లుకు ట్రంప్ ఇప్పటికే ఆమోదం తెలపగా.. ఈ వారంలో ఓటింగ్‌కు అవకాశం ఉన్న సంగతి తెలిసిందే. అయితే నేడు టీసీఎస్‌తో మొదలయ్యే డిసెంబరు త్రైమాసిక సీజను మార్కెట్‌కు కొంత ఉపశమనం కలిగిస్తుందని అంచనా వేస్తున్నారు. నిఫ్టీ50కి 25,90026,000 వద్ద నిరోధం, 25,570 వద్ద మద్దతు లభించొచ్చని సాంకేతిక నిపుణులు అంచనా వేస్తున్నారు. సోమవారం విడుదల కానున్న డిసెంబరు నెల సీపీఐ ద్రవ్యోల్బణ గణాంకాలు, అంతర్జాతీయ సంకేతాలు ఈ వారం మార్కెట్‌ను ప్రభావితం చేయొచ్చని చెబుతున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనా ఇలా.. డిసెంబరు త్రైమాసిక ఫలితాల ప్రకటనలు మొదలుకానున్నందున నిఫ్టీ బ్యాంక్ సూచీ ఈ వారం రాణించొచ్చు. ఈ సూచీ 5880060400 స్థిరీకరణ శ్రేణిలోనే కదలాడొచ్చు. ఈ శ్రేణి నుంచి బయట పడితేనే దిశానిర్దేశం లభిస్తుంది. లోహ కంపెనీల షేర్ల విలువ అధికంగా ఉండటంతో సమీప భవిష్యత్‌లో పరిమితంగానే పెరగొచ్చు. ట్రంప్ టారిఫ్ బెదిరింపులపై తదుపరి వార్తలు ఈ షేర్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. డిసెంబరు ఫలితాలనూ మదుపర్లు మదింపు చేయవచ్చు. నిఫ్టీ మెటల్ సూచీకి 1075010600 వద్ద మద్దతు లభించొచ్చు. టెలికాం షేర్లు సమీప భవిష్యత్‌లో ఒక శ్రేణికి లోబడి కదలాడొచ్చు. 2026లో టారిఫ్‌లు పెంచే అవకాశం ఉంది. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ మాతృసంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓ ప్రభావం చూపొచ్చు. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మధ్య చమురు కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. టారిఫ్ అంశాలపై స్పష్టత కోసం ఈ షేర్లు ఎదురుచూడవచ్చు. వెనెజువెలాపై అమెరికా దాడుల వల్ల చమురు ధర ఇంకా పడవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. యంత్రపరికరాల కంపెనీల షేర్లు ప్రతికూల ధోరణితో ఒక శ్రేణికి లోబడి కదలాడవచ్చు. చైనా కంపెనీలపై విధించిన 2020 నాటి ఆంక్షలను ఎత్తేయాలని కేంద్రం అనుకుంటుండడం ఇందుకు నేపథ్యం. వాహన కంపెనీల షేర్లు పుంజుకోవచ్చు. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు, గ్రామీణ సెంటిమెంటు మెరుగుపడడం, అక్టోబరుడిసెంబరులో బలమైన విక్రయాలు తదితరాలు కలిసిరావొచ్చు. కొత్త మోడళ్ల ఆవిష్కరణలు, ఎగుమతుల వృద్ధితో పలు కంపెనీల ఆదాయాలు రాణించొచ్చు. నిఫ్టీ ఐటీ సూచీ మార్కెట్‌తో పాటే రికవరీ ధోరణిలో కదలాడవచ్చు. నిఫ్టీ ఐటీ సూచీకి 37300 వద్ద మద్దతు, 38740 వద్ద నిరోధం కనిపించొచ్చు. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ ఫలితాలు సోమవారం వెలువడనున్నాయి. ఆ తర్వాతి రోజు టాటా ఎలెక్సీ ఫలితాలున్నాయి. హెచ్‌సీఎల్ షేర్లు రూ.16951700 స్థాయిని తాకొచ్చు. సిమెంటు కంపెనీలు నష్టాల్లోనే చలించొచ్చు. ధరల ఒత్తిడి కారణంగా వీటికి బలహీన డిసెంబరు త్రైమాసికం నమోదు కావొచ్చు. విక్రయాలు పెరిగినా ధరల కోత వల్ల లాభాల్లో రికవరీ కనిపించకపోవచ్చు. సిగరెట్లపై సుంకం పెంపుతో గత వారం డీలా పడ్డ ఎఫ్‌ఎమ్‌సీజీ కంపెనీల షేర్ల నష్టాలు కొనసాగొచ్చు. డిసెంబరు త్రైమాసికంలో వినియోగదారు గిరాకీలో రికవరీ అంచనా కంటే తక్కువగానే ఉండొచ్చు. ఫార్మా కంపెనీల షేర్లు ఒక శ్రేణిలోనే చలించొచ్చు. 15 నెలలుగా స్థిరీకరణ దశలో ఉన్న నిఫ్టీ ఫార్మా సూచీ దిశానిర్దేశం కోసం ఇక ఫలితాలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. భారత ఔషధ కంపెనీల దేశీయ విక్రయాల వృద్ధి ఒక అంకెలో ఉండొచ్చని జెఫ్రీస్ అంచనా కడుతోంది.

## 7 కంపెనీలు.. రూ.3,63,412 కోట్ల సంపద నష్టం

అమెరికా అధ్యక్షుడు రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 500% సుంకాలను విధించే దిశగా అడుగులు వేస్తుండడంతో గత వారం మార్కెట్ నష్టాల పాలైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 2,185.77 పాయింట్ల (2.54%)ను కోల్పోయింది. ఈ ప్రభావం అగ్రగామి 10 కంపెనీలపైనా కనిపించింది. వీటిలో ఏడు కంపెనీల మార్కెట్ విలువ ఏకంగా రూ.3,63,412.18 కోట్ల మేర క్షీణించింది. అత్యధికంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.1,58,532.91 కోట్లను నష్టపోయింది. మూడు కంపెనీలు మాత్రం మార్కెట్ విలువను పెంచుకోగలిగాయి. పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితులే ఈ పరిస్థితులకు కారణమని ఎన్రిచ్ మనీ సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) ఆర్.పొన్ముడి తెలిపారు.

# అనిశ్చితిలోనూ అనూహ్య స్థిరత్వం

**–అదీ భారత్ ప్రత్యేకత**
**–పెట్టుబడుల అవకాశాలను వినియోగించుకోండి**
**–'వైబ్రెంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సు'లో ప్రధాని మోదీ పిలుపు**



రాజ్‌కోట్: ప్రపంచమంతటా ఎంతో అనిశ్చితి నెలకొన్నా భారత్‌లో మాత్రం మునుపెన్నడూ లేనంత స్థిరత్వం కనిపిస్తోందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. రాజకీయ స్థిరత్వమే కాకుండా విధానాల కొనసాగింపును దేశం చూస్తోందని, దేశంలో ఉన్న వివిధ అవకాశాలను పెట్టుబడిదారులు ఉపయోగించుకోవాలని కోరారు. సౌరాష్ట్ర, కచ్ ప్రాంతంలో పెట్టుబడుల కోసం ఆదివారం రాజ్‌కోట్‌లో నిర్వహించిన 'వైబ్రెంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సు'లో ఆయన పాల్గొని ప్రసంగించారు. 'ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ మనది. త్వరలోనే మూడో స్థానాన్ని చేరుకోనున్నాం. వివిధ గణాంకాల్ని పరిశీలిస్తే.. ప్రపంచం మన నుంచి ఆశిస్తున్నది నిరంతరం పెరుగుతోందని స్పష్టమవుతోంది. విస్తరిస్తున్న మధ్యతరగతి వర్గం, వారికి ఉన్న కొనుగోలుశక్తి వంటివి మన దేశాన్ని అపార అవకాశాలకు గనిగా మార్చాయి. ప్రపంచంలో అత్యధిక టీకాలను ఉత్పత్తి చేస్తున్నది మనమే. మొబైల్ డేటా వినియోగం, యూపీఐ లావాదేవీల్లో ప్రపంచంలోనే మనం అగ్రస్థానంలో ఉన్నాం. సౌర విద్యుదుత్పత్తి, మెట్రో నెట్‌వర్క్‌లలోనూ విస్తరిస్తున్నాం. దేశంలోని ప్రతి పెట్టుబడిదారుడు, ప్రపంచం కూడా ఇలాంటివి అందిపుచ్చుకునేందుకు ముందుకు రావాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. వాణిజ్య ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. సదస్సులో 16 దేశాలకు చెందిన వ్యాపారవేత్తలతో 1,500 అవగాహన ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ, ఎస్సార్, నయారా ఎనర్జీ వంటి సంస్థలు పాల్గొంటున్నాయి. రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన కంపెనీలు వచ్చే అయిదేళ్లలో గుజరాత్‌లో రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ముకేశ్ అంబానీ తెలిపారు. గత అయిదేళ్లలో పెట్టిన రూ.3.5 లక్షల కోట్లతో పోలిస్తే ఇవి రెట్టింపని వివరించారు.

# భారత్‌లో క్రిప్టో నిబంధనలు మరింత కఠినం



డిజిటల్ ఆస్తుల మార్కెట్‌లో చట్ట విరుద్ధ కార్యకలాపాలను తొలగించే ప్రయత్నంలో భాగంగా, భారతదేశ ఆర్థిక నిఘా విభాగం (ఎఫ్ఐయూ) క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజీల కోసం కఠినమైన కొత్త యాంటీమనీ లాండరింగ్ (ఏఎంఎల్), నో యువర్ కస్టమర్ (కేవైసీ) ప్రోటోకాల్‌లను ఆవిష్కరించింది. వీటిలో ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ సమయంలో తప్పనిసరి లైవ్‌నెస్ డిటెక్షన్ (లైవ్ సెల్ఫీలు), భౌగోళిక ట్రాకింగ్ (జియో ట్యాగింగ్) వంటివి ఉన్నాయి. ఈ నెల 8న జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, క్రిప్టో ఎక్స్ఛేంజీలను వర్చువల్ డిజిటల్ అసెట్ (వీడీఏ) సర్వీస్ ప్రొవైడర్లుగా వర్గీకరించారు. ఇప్పుడు వీడీఏలు సాధారణ డాక్యుమెంట్ అప్‌లోడ్‌లను అనుమతించడంతో పాటు మరిన్ని పనులు చేయాల్సి ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం, వినియోగదారులు తమ ఉనికిని ధ్రువీకరించే 'లైవ్ సెల్ఫీ' తీసుకోవాలి. సాధారణంగా కళ్లు రెప్ప వేయడం లేదా తల కదలిక ద్వారా ఈ చర్య స్టాటిక్ ఫొటోలు లేదా డీప్‌ఫేక్‌ల వాడకాన్ని నిరోధించడంలో సాయపడుతుంది. వినియోగదారు ఖాతాను సృష్టించడం ప్రారంభించిన కచ్చితమైన అక్షాంశం, రేఖాంశం, తేదీ, సమయ ముద్ర; ఐపీ చిరునామాను ఎక్స్ఛేంజీలు నమోదు చేయాల్సి ఉంటుంది. 'పెన్నీడ్రాప్' పద్ధతి అవసరం. దీనిలో బ్యాంక్ ఖాతా యాక్టివ్‌గా ఉందని, రిజిస్ట్రన్ట్‌కు చెందినదని నిర్ధారించడానికి నామమాత్రపు రూపాయి లావాదేవీని ప్రాసెస్ చేస్తారు. పాన్ (శాశ్వత ఖాతా సంఖ్య)తో పాటు వినియోగదారులు పాస్‌పోర్ట్, ఆధార్ లేదా ఓటరు ఐడీ వంటి సెకండరీ ఐడీని, ఇమెయిల్ ఐడీ, ఫోన్ నంబరు కోసం ఓటీపీ ధ్రువీకరణను అందించాలి.

# కొత్త డీమ్యాట్ ఖాతాల కళ తగ్గింది

***–2025లో ఆరేళ్ల కనిష్ఠానికి***



ఈనాడు, హైదరాబాద్: కరోనా తర్వాత స్టాక్ మార్కెట్‌ను ముంచెత్తిన కొత్త డీమ్యాట్ ఖాతాల ప్రవాహానికి 2025లో అడ్డుకట్ట పడింది. గత కొన్నేళ్లుగా రికార్డు స్థాయిలో నమోదైన ఖాతాల వృద్ధి రేటు ఇప్పుడు నెమ్మదించింది. గతేడాది కొత్త డీమ్యాట్ ఖాతాల వృద్ధి రేటు గత ఆరేళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ఠానికి పడిపోయింది. మార్కెట్లో చురుగ్గా లావాదేవీలు జరిపే వారి సంఖ్య కూడా క్రమంగా తగ్గుముఖం పడుతున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. పసిడి, వెండి వైపు..: భారత ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, కొత్త మదుపరులపై ప్రభావం చూపుతోంది. మరోవైపు బంగారం, వెండి మిలమిలా మెరుస్తూ లాభాలను పంచాయి. దీంతో మదుపరులు గోల్డ్ ఈటీఎఫ్‌లలో మదుపు చేసేందుకు ప్రాధాన్యం ఇచ్చారని యాంఫీ తాజా నివేదిక స్పష్టం చేసింది. వీటన్నింటి ప్రభావంతో కొత్తగా ప్రారంభమయ్యే డీమ్యాట్ ఖాతాల వృద్ధి రేటు 2024తో పోలిస్తే 2025లో సగానికి పైగా పడిపోయింది. కొత్తవి 3 కోట్లే..: డిపాజిటరీల గణాంకాల ప్రకారం 2024లో దేశ వ్యాప్తంగా 4.60 కోట్ల కొత్త డీమ్యాట్ ఖాతాలు ప్రారంభం అయ్యాయి. 2025లో ఈ సంఖ్య కేవలం 3.06 కోట్లకు పరిమితమైంది. డిసెంబరు 31 నాటికి మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 21.6 కోట్లకు చేరుకుంది. వాస్తవానికి కరోనా తర్వాత స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడం, ఖాతా ప్రారంభ ప్రక్రియ సులభతరం కావడంతో గడిచిన అయిదేళ్లలో డీమ్యాట్ ఖాతాలు నాలుగు రెట్లు పెరిగాయి. 2020లో డీమ్యాట్ ఖాతాల సంఖ్య సుమారు 5 కోట్లే కావడం గమనార్హం. మార్కెట్లో ప్రతికూలతలు: గతేడాది భారత ఈక్విటీ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గులను చూశాయి. ముఖ్యంగా భారత్‌పై అమెరికా సుంకాలను విధించడంతో వాణిజ్య పరంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికి తోడు కంపెనీల ఆదాయాలూ ఆశించిన స్థాయిలో లేవు. గణాంకాల ప్రకారం 2025లో సెన్సెక్స్ 9.06 శాతం, నిఫ్టీ 10.5 శాతం మేరకు లాభాలు ఇచ్చాయి. చిన్న, మధ్య తరహా షేర్లలో పరిస్థితి భిన్నంగా ఉంది. నిఫ్టీ మిడ్‌క్యాప్100 సూచీ 5.7 శాతం పెరగ్గా, నిఫ్టీ స్మాల్‌క్యాప్100 5.62 శాతం నష్టపోయింది. మార్కెట్‌లోని అగ్రశ్రేణి సంస్థల్లో దాదాపు 60 శాతం షేర్లు మదుపరులకు నష్టాన్నే మిగిల్చాయి. ఐపీఓలతో..: మార్కెట్లోకి వస్తున్న కొత్త ఐపీఓలే కొత్త డీమ్యాట్ ఖాతాలకు కారణం అవుతున్నాయి. ఐపీఓ కేటాయింపుల్లో షేర్లు దక్కే అవకాశాలను పెంచుకునేందుకు చాలామంది తమ కుటుంబ సభ్యుల పేరుతో కొత్తగా డీమ్యాట్ ఖాతాలను ప్రారంభించారని నివేదికలు పేర్కొంటున్నాయి.

**--అటూఇటూ మారుతున్నారు.....** మార్కెట్‌లో దిద్దుబాటు కనిపించడం, మదుపరులు ఒక బ్రోకరు నుంచి మరో బ్రోకరుకు మారడంలాంటి కారణాలూ డీమ్యాట్ వృద్ధిని దెబ్బతీశాయని నిపుణులు పేర్కొంటున్నారు. మార్కెట్ సంతృప్త స్థాయిని చేరుకుందని, ఈ నేపథ్యంలో కొత్త మదుపరులను ఆకర్షించేందుకు బ్రోకర్లకు అయ్యే వ్యయం పెరుగుతోందని పేర్కొంటున్నారు. మరోవైపు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ.. ఎఫ్ అండ్ ఓ నిబంధనలు కఠినతరం చేయడమూ కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి అవగాహన లేకుండా మార్కెట్లోకి వచ్చి, నష్టపోయే వారికి అడ్డుకట్ట వేయడం అని పేర్కొంటున్నారు.

## ఎన్‌టీపీసీ రూ.10,000 కోట్ల పెట్టుబడులు




ఛత్తీస్‌గఢ్‌లోని తలాయ్‌పల్లిలో బొగ్గు నుంచి సింథటిక్ నేచురల్ గ్యాస్ తయారు చేసే కేంద్రాన్ని రూ.10,000 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయనున్నట్లు ఎన్‌టీపీసీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. సింథటిక్ నేచురల్ గ్యాస్ (ఎస్ఎన్‌జీ) ఉత్పత్తి కోసం అవసరమైన బొగ్గు బెనిఫిషియేషన్, గ్యాసిఫికేషన్ వంటి ప్రక్రియలకు సాంకేతిక భాగస్వామ్యాల కోసం కంపెనీ చూస్తున్నట్లు వెల్లడించారు. ఒక్కో మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్ (ఎంఎంబీటీయూ)కు దాదాపు 12 డాలర్ల ఖర్చుతో ఎస్ఎన్‌జీని ఉత్పత్తి చేయాలని ఎన్‌టీపీసీ భావిస్తోంది. ఎస్ఎన్‌జీ కేంద్రాన్ని అభివృద్ధి చేయడానికి ఇంజినీర్స్ ఇండియాతో గతేడాది అక్టోబరులో ఎన్‌టీపీసీ ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఎస్ఎన్‌జీ ప్లాంట్ ఏర్పాటు చేయబోయే ప్రాంతం వివరాలను కంపెనీ ప్రకటించలేదు. తమ క్యాప్టివ్ గనుల నుంచి అధిక బూడిద కలిగిన బొగ్గును ఈ ప్లాంట్ కోసం వినియోగించనున్నట్లు తెలిపింది. తలాయ్‌పల్లిలో 150 ఎకరాల విస్తీర్ణంలో 5 లక్షల టన్నుల వార్షిక సామర్థ్యంతో ఎస్ఎన్‌జీ ప్రాజెక్టును ఏర్పాటు చేసే అవకాశం ఉంది. 202526 చివరి త్రైమాసికంలో ప్రాజెక్టు టెక్నాలజీ అంశాలను ఖరారు చేయనున్నారు. పలు అంతర్జాతీయ భాగస్వామ్యాల కోసం తుది దశ చర్చల్లో ఎన్‌టీపీసీ ఉంది.

# భవిష్యత్‌లో పూర్తిగా విద్యుత్ కార్లే

**వోల్వో ఇండియా ఎండీ జ్యోతి మల్హోత్రా**



భవిష్యత్‌లో పూర్తిగా విద్యుత్ కార్లు తీసుకొచ్చేందుకు కట్టుబడి ఉన్నామని, ప్రస్తుతం భారత్‌లో విక్రయిస్తున్న ప్రతి నాలుగు కార్లలో ఒక విద్యుత్ కారు (ఈవీ) ఉంటోందని వోల్వో కార్ ఇండియా ఎండీ జ్యోతి మల్హోత్రా పేర్కొన్నారు. జీఎస్‌టీ 2.0 వల్ల తమ మైల్డ్ హైబ్రిడ్ ఎస్‌యూవీలు కొనుగోలుదార్లకు మరింత చేరువయ్యాయని అన్నారు. పన్ను రేట్లలో మార్పులు తీసుకురావడంతో విలాస విభాగంలో మార్పులు వచ్చాయని, మొత్తం వాహన పరిశ్రమపై సానుకూల ప్రభావం చూపినట్లు వెల్లడించారు. ఈవీ కార్లపై జీఎస్‌టీ 2.0 ప్రభావంపై మాట్లాడుతూ, కంపెనీ పోర్ట్‌ఫోలియో మిశ్రమంగా ఉందని, ప్రతి 4 విక్రయాల్లో ఒక ఈవీ ఉంటోందని వివరించారు. కొత్త ఈఎక్స్30 మోడల్ విజయవంతం కావడం, కాంపాక్ట్ మాడ్యులర్ ఆర్కిటెక్చర్ (సీఎంఏ) లభ్యత వంటివి ఇందుకు కారణాలుగా తెలిపారు. భవిష్యత్‌లో మొత్తం విద్యుత్ కార్లకు కట్టుబడి ఉన్నామని, 2026లో మరిన్ని ఈవీ కార్లను తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఎక్స్‌సీ 90, ఎక్స్‌సీ60 మోడళ్ల నెలవారీ విక్రయాల్లో రెండంకెల వృద్ధి ఉంటోందన్నారు.

# ఎంఎస్ఎంఈలకిచ్చిన రుణాల్లో రెట్టింపు వృద్ధి




గత ఏడాది జనవరిఅక్టోబరు మధ్య సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ (ఎస్ఎస్ఎంఈ)లకు పంపిణీ చేసిన రుణాల వాటా దాదాపు రెట్టింపు కావడానికి ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీల) రుణాలు సాయపడ్డాయని క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదిక వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో 17.7 శాతంగా ఉన్న ఎంఎస్ఎంఈ రుణాల వాటా ఈ ఏడాది అక్టోబరు వరకు 32.5 శాతానికి పెరిగిందని తెలిపింది. మొత్తం ఎంఎస్ఎంఈ రుణాల్లో చిన్నపరిమాణం, హామీలేని రుణాల్లో ఒత్తిడి సంకేతాలు కనిపించాయని పేర్కొంది. అయితే ఎంఎస్ఎంఈల పోర్ట్‌ఫోలియోలో ఆస్తుల నాణ్యత సంతృప్తికరంగానే ఉందని వెల్లడించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆర్థిక స్థిరత్వ నివేదికలోని ఫలితాలను క్రిసిల్ నివేదిక కూడా ప్రస్తావించింది. పీఎస్‌బీలు సబ్‌ప్రైమ్ ఎంఎస్ఎంఈ రుణగ్రహీతలకు గణనీయ స్థాయిలో రుణాలు పంపిణీ చేశాయని పేర్కొంది. బ్యాంకు రుణాల్లో 12.6 శాతం అమెరికా సుంకాలకు సరిపోతున్నాయని, అందులో 43 శాతానికి పైగా వస్త్ర రంగం ద్వారానే ఉన్నాయని వెల్లడించింది. హామీ ఉన్న రిటెయిల్ రుణాల వాటా కూడా పెరిగిందని, అంత క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 24.5 శాతం ఉండగా, గత ఏడాది 31.3 శాతానికి పెరిగిందని నివేదిక పేర్కొంది. ఇందులో సుమారు 50 శాతం గృహ రుణాలు కాగా, మూడో వంతు కంటే ఎక్కువగా పసిడి రుణాలు ఉన్నాయని తెలిపింది.

## ప్రభాస్ ను టెన్షన్ పెడుతోన్న 'R' లెటర్ ..?



టాలీవుడ్ అగ్ర హీరో ప్రభాస్ తాజాగా నటించిన సినిమా ది రాజా సాబ్. సంక్రాంతి కానుకగా జనవరి 8వ తేదీన రిలీజ్ అయిన ఈ సినిమా మిక్స్డ్ టాక్ తెచ్చుకుంది. అయితే సంక్రాంతి హాలిడేస్ ఉండడంతో పాటు ప్రభాస్ సినిమా కావడం కారణంగా కలెక్షన్స్ విపరీతంగానే వస్తున్నాయి. మొదటి రోజున రూ.120కి పైగా కోట్లు కొల్లగొట్టింది ది రాజా సాబ్ సినిమా. ఈ సినిమాకు మారుతి దర్శకత్వం వహించగా, ముగ్గురు హీరోయిన్లు నటించారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ది కుమార్ మెరిసిన సంగతి తెలిసిందే.

పాన్ ఇండియా స్టార్ హీరోగా మారిన ప్రభాస్ ను R లెటర్ టెన్షన్ పడుతోందట. ఈ లెటర్ తో వచ్చిన సినిమా నెగిటివ్ టాక్ తెచ్చుకుంటున్నట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. గతంలో R లెటర్ పైన రాఘవేంద్ర, రెబల్, రాధే శ్యామ్ తాజాగా రాజా సాబ్ సినిమాలు చేశారు ప్రభాస్. అయితే గతంలో విడుదలైన మూడు సినిమాలు కూడా బాక్సాఫీస్ ముందు పెద్దగా ఆడలేదు. ప్రస్తుతం ది రాజా సాబ్ థియేటర్ లో నడుస్తోంది. అయితే ఈ సినిమా రిలీజ్ కంటే ముందు, ఓ రేంజ్ లో హిట్ అవుతుందని అందరూ అంచనా వేసుకున్నారు. మారుతి ఇచ్చిన స్పీచ్ తో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. కానీ రిలీజ్ అయిన తర్వాత, నెగిటివ్ టాక్ వస్తోంది. అటు కలెక్షన్స్ మాత్రం బాగానే రాబడుతోంది ది రాజా సాబ్. ఈ నేపథ్యంలోనే ప్రభాస్ కు R లెటర్ అచ్చి రావడంలేదని అంటున్నారు.

# ఇది ప్రభాస్ గిఫ్ట్







బలమైన క్రమశిక్షణతో పెరిగిన మనసు, కళను ప్రేమించే హృదయం ఈ రెండింటి మధ్య సమతుల్యతే ఆమె వ్యక్తిత్వం. భాషలు మారినా, పాత్రలు మారినా తన అసలైన స్వరాన్ని మాత్రం కోల్పోని నటి రిద్ధి కుమార్. ఆ విషయాలన్నీ ఆమె మాటల్లోనే..

ఆర్మీ బ్యాక్‌గ్రౌండ్‌లో పెరగడం వల్ల చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ, ఫోకస్, దేనికైనా ఈజీగా అడాప్ట్ అవడం అన్నీ సహజంగానే అలవాటయ్యాయి.

భాషలు నేర్చుకోవడం నాకు చాలా ఇష్టం. ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళం, ఫ్రెంచ్ సహా ఏడు భాషలు మాట్లాడగలను. కొత్త భాష అంటే నాకు కొత్త ప్రపంచం.

మిస్ యూనివర్స్ ఇండియా వైల్డ్‌కార్డ్‌గా తిరిగి రావడం నాకే ఒక సర్‌ప్రైజ్. నటనతో పాటు నేనెవరో మళ్లీ గుర్తు చేసిన అనుభవం అది. అదే నన్ను సినిమాల్లోకి కూడా తీసుకొచ్చింది.

తొలిసారి 'లవర్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యాను. తర్వాత 'అనగనగా ఓ అతిథి', 'రాధే శ్యామ్' చేశాను. ఇలా ప్రతి సినిమా నాకు ఒక పాఠమే.

కెమెరా ముందు నటించడమే కాదు, కెమెరా వెనుక ప్రపంచాన్ని చూడడం కూడా నాకు చాలా ఇష్టం. ఫొటోగ్రఫీ చేస్తూ 'ఈ క్షణం మళ్లీ రాదు' అని అనిపిస్తుంది.

ట్రావెల్ అంటే టూరిస్టు స్పాట్స్ కంటే 'హిడెన్ జెమ్స్' నాకు ఎక్కువ ఇష్టం. ఇటీవల అహ్మదాబాద్ ఓల్డ్ సిటీ వైబ్స్ నన్ను చాలా ఆకట్టుకున్నాయి.

పుస్తకాలు నా బలహీనత. చదివే సమయం లేకపోయినా, కొనకుండా ఉండలేను. ఫిలాసఫీ అంటే నాకు చాలా ఆసక్తి.

ఎంత బిజీగా ఉన్నా చదువు మాత్రం వదల్లేదు. 2025లో కూడా మాస్టర్స్ ఇన్ ఫిలాసఫీ చేస్తున్నాను.

స్కిన్ కేర్ విషయంలో కొన్ని తప్పులు చేశాను. మేకప్‌తోనే నిద్రపోవడం, వేడి నీళ్లతో ముఖం కడగడం ఇవన్నీ ఇప్పుడిప్పుడే మానేసి కాస్త జాగ్రత్తలు తీసుకుంటున్నాను.

ఫ్యాషన్ విషయంలో నా స్టయిల్ మారుతూనే ఉంటుంది. ప్రస్తుతం దేసీ స్టయిల్ ఇష్టం. ముఖ్యంగా చీరలో ఉన్న అందం వేరే లెవల్. ఇప్పుడు నేను కట్టుకున్న చీర ప్రభాస్ గిఫ్ట్‌గా ఇచ్చిందే. ఇది వేసుకున్నప్పుడు ఇంకా ప్రత్యేకంగా అనిపిస్తుంది.

నేనొక పెద్ద ఫూడీ. పుణేలోని ఒక టిబెటన్ స్ట్రీట్ ఫుడ్ స్పాట్ నాకు చాలా ఇష్టం. మోమోస్, థుక్‌పా అంటే ప్రాణం. అలాగే నెయ్యి దోశ, నెయ్యి కారంపొడి ఇడ్లీ, ఫిల్టర్ కాఫీ ఉంటే చాలు.

ప్రతి ఒక్కరికీ కొన్ని ఆధ్యాత్మిక ట్రిప్స్ చాలా అవసరం. అలా శంకరాచార్య ఆలయంతో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది.

2025 నాకు చాలా స్పెషల్. 'ది రాజా సాబ్' సినిమాలో ప్రభాస్‌తో కలిసి నటించడం నా కెరీర్‌లో పెద్ద అడుగు. అలాగే ఈ న్యూ ఇయర్‌కు మరాఠీ సినిమాతో కొత్త ఇండస్ట్రీలోకి కూడా అడుగు పెట్టబోతున్నాను.



## పవన్‌కల్యాణ్ అరుదైన ఘనత.. 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' టైటిల్

: సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ (Pawan Kalyan) అరుదైన ఘనత సాధించారు. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యులైన ఆయన.. ప్రాచీన జపనీస్ కత్తిసాము కళ 'కెంజుట్సు'లో అధికారికంగా ప్రవేశం పొంది అంతర్జాతీయ గౌరవాన్ని సాధించారు. మూడు దశాబ్దాలకు పైగా సాగించిన సాధన, పరిశోధన, అంకితభావానికి నిదర్శనంగా ఈ అరుదైన ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. కరాటే, యుద్ధకళల పట్ల ఆసక్తి కలిగిన పవన్.. చెన్నైలో ఉండగానే కఠినమైన శిక్షణతో పాటు నిరంతర సాధన చేశారు. శారీరక సాధనకే పరిమితం కాకుండా, జపనీస్ సమురాయ్ మార్షల్ సంప్రదాయాలపై లోతైన అధ్యయనం చేసి, పరిశోధించి వాటిని అనుసరించారు. పలు సినిమాల్లో మార్షల్ కళలను తెరపై ప్రదర్శిస్తూ, వాటికి విస్తృత గుర్తింపు మరియు ప్రజాదరణ తీసుకొచ్చారు.



జపాన్ సంప్రదాయ యుద్ధకళల్లో అత్యంత గౌరవనీయమైన సంస్థలలో ఒకటైన 'సోగో బుడో కన్‌రికై' నుంచి ఆయనకు ఫిఫ్త్ డాన్ (ఐదో డాన్) పురస్కారం లభించింది. జపాన్ వెలుపల 'సోకే మురమత్సు సెన్సై'లోని 'టకెడా షింగెన్ క్లాన్'లో ప్రవేశం పొందిన తొలి తెలుగు వ్యక్తిగా ఆయన నిలిచారు. గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ ఆయనకు 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' (Tiger of Martial Arts) అనే విశిష్ట బిరుదు అందించింది. ప్రముఖ బుడో నిపుణుడు హాన్షి ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధిక్ మహ్మదీ మార్గదర్శకత్వంలో పవన్‌కల్యాణ్ 'కెండో'లో సమగ్ర శిక్షణ పొంది, ఉన్నత స్థాయి సాంకేతిక నైపుణ్యం పొందారు. సినిమా, శాస్త్రీయ యుద్ధకళలు, యుద్ధ తత్వశాస్త్రాలను అంతర్జాతీయ వేదికపై సమన్వయం చేయగలిగిన అతి కొద్దిమంది భారతీయ ప్రముఖుల్లో ఒకరిగా పవన్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.



# పవన్ కల్యాణ్ తర్వాత ఆ లక్షణం రవితేజలోనే చూశా



''ఆద్యంతం నవ్వుల ప్రయాణంలా సాగే సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'' అన్నారు కథానాయకుడు రవితేజ. ఈ చిత్రంలో ఫైట్లు కూడా వినోదాత్మకంగానే ఉంటాయని చెప్పారు. ఆయన.. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి నాయకానాయికలుగా నటించిన ఈ చిత్రాన్ని కిశోర్ తిరుమల తెరకెక్కించారు. సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ సినిమా ఈనెల 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. దర్శకులు హరీశ్ శంకర్, బాబీ, శివ నిర్వాణ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హీరో రవితేజ మాట్లాడుతూ.. ''ఈ చిత్రంలో నేను.. ఆషికా, డింపుల్ కలిసి చేసిన అల్లరి ఎలా ఉంటుందన్నది థియేటర్లలో చూస్తారు. ఈ సినిమాలో వాళ్లతో పాటు నేను అందంగా కనిపించానంటే ఆ క్రెడిట్ సినిమాటోగ్రాఫర్ ప్రసాద్ మూరెళ్లకే చెందుతుంది. సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా కొంతమంది దర్శకులతో కలిసి ప్రయాణించడాన్ని నేను చాలా ఆస్వాదిస్తా. అలా అనిల్ రావిపూడి, హరీశ్ శంకర్, బాబీ, కిశోర్‌లతో నేను విపరీతంగా ఎంజాయ్ చేస్తా. ఈ సినిమాతో నాది.. కిశోర్‌ది మంచి హిట్ ట్రాక్ అవ్వాలని కోరుకుంటున్నా. ఈ చిత్రం కచ్చితంగా పెద్ద హిట్టవుతుంది'' అన్నారు. ''ఈ చిత్రాన్ని ప్రేక్షకులు కచ్చితంగా చాలా ఎంజాయ్ చేస్తారు. తప్పకుండా థియేటర్లలో చూడండి'' అన్నారు దర్శకుడు కిశోర్ తిరుమల.

దర్శకుడు హరీశ్ శంకర్ మాట్లాడుతూ.. ''ఈ సినిమాకి మాస్ మహారాజా అనే ట్యాగ్ తీసేయమని రవితేజ అన్నారని సామాజిక మాధ్యమాల్లో వినిపించింది. నిజానికి ఆ పేరుకు పేటెంట్ రైట్స్ నావే. దాన్ని ఉంచాలన్నా.. తీసేయాలన్నా నన్నే అడగాలి. 'మిరపకాయ్' వచ్చినా 'మిస్టర్‌బచ్చన్' వచ్చినా ఒకేలా ఉండే వ్యక్తిత్వం రవితేజ సొంతం. సినిమా ఆడిందా.. ఊడిందా అనేది అసలు పట్టించుకోరు. తనొక స్థిత ప్రజ్ఞుడు. ఇలాంటి లక్షణం పవన్ కల్యాణ్ తర్వాత రవితేజలోనే చూశా. కొన్నేళ్ల క్రితం ఆయన నుంచి వచ్చిన 'మిరపకాయ్' జనవరి 13న విడుదలై బ్లాక్‌బస్టర్ అయింది. ఇప్పుడదే తేదీకి వస్తున్న ఈ క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కూడా కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి, సుధాకర్ చెరుకూరి, బాబీ, పవన్, ఏఎస్ ప్రకాశ్, ప్రసాద్ మూరెళ్ల, సురేశ్ గంగుల తదితరులు పాల్గొన్నారు

## ఫేక్ రివ్యూలు.. నెగెటివ్ రేటింగ్స్.. 'బతకండి.. బతకనీయండి' అంటున్న విజయ్



ఇటీవల కాలంలో తెలుగు చిత్ర పరిశ్రమను తీవ్రంగా వేధిస్తున్న సమస్యల్లో ఫేక్ రివ్యూలు ఒకటి. పైగా సామాజిక మాధ్యమాల వేదికగా వాటిని ట్రెండ్ చేస్తున్నారు. దీనికి తోడు బుక్ మై షోలోనూ నెగెటివ్ రేటింగ్స్ ఇస్తున్నారు. దీనిపై పలువురు కోర్టును ఆశ్రయించారు, కోర్టు ఆదేశాల మేరకు బుక్ మై షో తన వెబ్‌సైట్‌లో సినిమాలకు రేటింగ్స్, రివ్యూలను తాత్కాలికంగా నిలిపివేసింది. దీనిపై కథానాయకుడు విజయ్ దేవరకొండ (Vijay Deverakonda) ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ చర్య తనకు సంతోషాన్ని ఇచ్చినా, కొంత బాధనూ కలిగిస్తోందని అభిప్రాయపడ్డారు.

''బుక్ మై షోలో ఇలా చూడటం ఒక రకంగా సంతోషంగా, మరో రకంగా బాధగానూ ఉంది. ఈ చర్యతో చాలా మంది కష్టం, కలలు, డబ్బును కాపాడుకునేందుకు దారి కనపడింది. ఇక విచారించాల్సిన విషయం ఏంటంటే, మన సొంత వాళ్లే ఇలాంటి సమస్యలు సృష్టిస్తున్నారు. 'బతకండి. బతనీయండి' అనే నినాదం ఏమైంది? అందరూ కలిసి ఎదగాలనే భావన ఎక్కడికి వెళ్లింది? 'డియర్ కామ్రేడ్' మూవీ సమయంలో వ్యవస్థీకృతమైన రాజకీయాలతో కూడిన ఇలాంటి దాడులు చూసి షాకయ్యా. నేను మాట్లాడిన ప్రతిసారి చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లు అయింది. పైగా ఒక మంచి సినిమాను ఎవరూ ఆపలేరని నాకే చెప్పేవారు. నాతో పని చేసిన దర్శకులు, నిర్మాతలకు ఈ సమస్య తీవ్రత అర్థమైంది'' ''ఎందుకోసం ఇదంతా చేస్తున్నారని ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపా. నా కలలను కాపాడుకునేందుకు వీళ్లతో ఎలా పోరాటం చేయాలా? అనుకున్నా. ఇన్నాళ్లకు ఈ విషయం బహిరంగంగా వచ్చినందుకు సంతోషిస్తున్నాను. మెగాస్టార్ లాంటి అగ్ర హీరో సినిమాకు కూడా ముప్పు ఉందని కోర్టు గుర్తించినందుకు ఆనందంగా ఉంది. కేవలం దీనితోనే సమస్యకు పూర్తి పరిష్కారం లభించదు. కానీ, ఉపశమనమైతే లభిస్తుంది. ఇదంతా పక్కనపెట్టి 'మన శంకరవరప్రసాద్'(Mana Shankara Varaprasad Garu) తో పాటు సంక్రాంతికి వస్తున్న అన్ని సినిమాలు విజయం సాధించాలని, ప్రేక్షకులను అలరించాలని కోరుకుందాం'' అని విజయ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశాడు.

# సింపుల్ దుస్తులనే కొంటా!

**పేరుకే స్టార్ కాని, సింప్లిసిటీ, సౌకర్యానికి ప్రాధాన్యం ఇస్తూ, తను చేసే ఫ్యాషన్ ఎంపికలే ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టాయి. ట్రెండ్స్‌కు దూరంగా, తనకిష్టమైన స్టయిల్‌ను నమ్ముతూ ముందుకెళ్లే కాజల్ అగర్వాల్ ఫాలో అయ్యే ఫ్యాషన్ టిప్స్ ఏంటో ఇక్కడ చూద్దాం!**

**డ్రెస్.. బ్రాండ్: కోరస్ ధర రూ. 36,800**
**జ్యూలరీ బ్రాండ్: హైబా జ్యూవెల్స్**
**ధర: రూ. 40,000**
**బెల్ట్ బ్రాండ్: గూచి**
**ధర: డిజైన్ నాణ్యతపై ఆధారపడి ఉంటుంది.**

వన్ టైమ్ వేర్ నాకు నచ్చదు. సింపుల్ దుస్తులనే కొనుగోలు చేస్తాను. అందులోనూ జ్యూయెల్ టోన్స్ అంటే చాలా ఇష్టం. వాటిల్లోనే గ్లామర్, సౌకర్యం రెండూ దొరుకుతాయి. చర్మ సౌందర్యం కోసం ప్రతి రోజు కోకోనట్ వాటర్‌ను ఐస్ క్యూబ్‌లా ఫ్రీజ్ చేసి ముఖంపై రుద్దుతాను. అప్పుడు చర్మం హైడ్రేటెడ్‌గా, ఫ్రెష్‌గా ఉంటుంది.

**కట్టిపడేసే అందం!**

కదిలే నడుమును కట్టిపడేసే అందాల మంత్రం ఈ బెల్ట్! ముఖ్యంగా మిడీ డ్రెస్సుకు ప్రాణం పోసే యాక్సెసరీగా ఇది పనిచేస్తుంది. పూర్వం బెల్ట్‌ను బరువులు, ఆయుధాలు తగిలించుకునేందుకు మాత్రమే ఉపయోగించేవారు కాని, ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలో ఫార్మల్, ఫంక్షన్ రెండింటినీ మిక్స్ చేస్తూ ఒక స్టేట్‌మెంట్ పీస్‌గా మారింది. ప్రధానంగా పురుషుల దుస్తుల భాగంగా ప్రాచుర్యం పొందిన బెల్ట్, ఇప్పుడు మహిళల డ్రెస్సులపై నడుము ఆకృతిని హైలైట్ చేసే స్టయిల్ ఎలిమెంట్‌గా నిలుస్తోంది. ఇది నడుమును స్పష్టంగా చూపిస్తూ, మొత్తం అవుట్‌ఫిట్‌ను షేప్‌లోకి తీసుకొచ్చే మ్యాజిక్‌లా పనిచేస్తుంది. బెల్ట్ బకిల్ దగ్గర ఉండే డీటైల్స్, డిజైన్స్ మెరుస్తున్న టచ్‌తో కలిసి అందరి చూపును నేరుగా నడుము వైపు లాక్కుంటాయి. ఫ్లోయీ లేదా ఏలైన్ మిడీ డ్రెస్సులపై ఇలాంటి వైడ్ బెల్ట్‌లు ఎంతో బాగా సూట్ అవుతాయి. అంతేకాదు, లూజ్ డ్రెస్సులకు కూడా ఇవి ఇన్‌స్టంట్‌గా హగ్గింగ్ టచ్‌ను ఇస్తాయి. డిజైన్స్, స్టయిల్స్ పరంగా మార్కెట్‌లో ఎన్నో వెరైటీల్లో ఇవి సులభంగా అందుబాటులో ఉన్నాయి. - కాజల్ అగర్వాల్ .



# 'ఆదివారం సైకిల్‌పై' గోపీచంద్, పేస్

**–సైకిల్ ర్యాలీలో మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, లియాండర్ పేస్, గోపీచంద్**



ప్రజలకు ఫిట్‌నెస్ ప్రాధాన్యం తెలియజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఆదివారం సైకిల్‌పై' కార్యక్రమంలో భారత బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్, టెన్నిస్ గ్రేట్ లియాండర్ పేస్ పాల్గొన్నారు. ఆదివారం దిల్లీలో జరిగిన భారీ సైకిల్ ర్యాలీకి వీళ్లిద్దరూ హాజరయ్యారు. దిల్లీలో ఆదివారం చేపట్టిన ఈ భారీ సైకిల్ ర్యాలీలో కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సహా వివిధ రాష్ట్రాలకు చెందిన 500 మంది రాజకీయ నాయకులు, ఇంకో 500 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. మంత్రితో కలిసి గోపీచంద్, పేస్ సైకిల్ తొక్కారు. దేశవ్యాప్తంగా సుమారు 15 వేలకు పైగా ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

# అర్జున్‌కు కాంస్యం

**నిహాల్, వంతికలకు రజతాలు**



కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ టోర్నీ బ్లిట్జ్ విభాగంలో తెలుగు కుర్రాడు అర్జున్ ఇరిగేశి కాంస్యం సాధించాడు. ర్యాపిడ్‌లో కాంస్యం గెలిచిన నిహాల్ సరీన్.. బ్లిట్‌జ్‌లో మరింత మెరుగైన ప్రదర్శనతో రజతం సాధించాడు. నిహాల్, అర్జున్ 18 రౌండ్లలో 11 పాయింట్లతో సమమైనప్పటికీ.. టైబ్రేక్‌లో మెరుగైన స్కోరుతో నిహాల్ రెండో స్థానంలో నిలిచాడు. అమెరికా క్రీడాకారుడు వెస్లీ సో (12 పాయింట్లు) టైటిల్ దక్కించుకున్నాడు. ప్రజ్ఞానంద (9.5 పాయింట్లు) 6.. దిగ్గజ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ (8 పాయింట్లు) 8 స్థానాలతో సరిపెట్టుకున్నారు. ఉత్కంఠగా సాగిన మహిళల పోరులో కరిస్సా యిప్ (10.5 పాయింట్లు) టైటిల్ గెలవగా.. వంతిక ఆగర్వాల్ (10.5 పాయింట్లు) రజతం సాధించింది. వైశాలి (9.5 పాయింట్లు), దివ్య దేశ్‌ముఖ్ (8.5 పాయింట్లు) వరుసగా

# 'జాతీయ భాషను నమ్ముతాను'.. మాజీ కోచ్ వ్యాఖ్యలపై దుమారం



భారత్ న్యూజిలాండ్ తొలి వన్డే కామెంట్రీ సందర్భంగా మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. బౌలింగ్ విషయంలో వాషింగ్టన్ సుందర్‌కు కేఎల్ రాహుల్ తమిళంలో సూచనలు ఇవ్వడంపై స్పందిస్తూ.. తాను 'జాతీయ భాష'కే ఎక్కువ ప్రాధాన్యమిస్తానని వ్యాఖ్యానించాడు. ఇది కాస్తా నెట్టింట విమర్శలకు దారితీసింది. టీమ్ఇండియా బౌలింగ్ సమయంలో వరుణ్ ఆరోన్, సంజయ్ బంగర్ హిందీ కామెంట్రీ చేశాడు. ఆ సమయంలో స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ బంతులు వేగంగా విసరడంపై కేఎల్ రాహుల్ వారించాడు. 'మీడియం పేసర్ స్థాయి వేగంతో బంతిని ఎందుకు వేస్తున్నావ్? స్పిన్నర్ మాదిరి వేగం తగ్గించు' అని తొలుత హిందీలో చెప్పాడు. ఫలితం లేకపోవడంతో.. ఆ తర్వాత తమిళంలో సూచనలు ఇచ్చాడు. వెంటనే సుందర్ బౌలింగ్ వేగం తగ్గింది. ఇదే విషయాన్ని వరుణ్ ఆరోన్ ప్రస్తావిస్తూ.. వాషింగ్టన్ సుందర్‌కు తమిళంలో ఎక్కువగా అర్థం అవుతుందనే నా వాదనను అంగీకరిస్తారా? అని సంజయ్ బంగర్‌ను ప్రశ్నించారు. దానికి ఆయన.. ''నేను జాతీయ భాషనే ఎక్కువగా నమ్ముతా'' అని సమాధానం ఇచ్చాడు. సంజయ్ వ్యాఖ్యలపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఆయన తప్పుడు కథనాలు వ్యాప్తి చేస్తున్నారని విమర్శిస్తున్నారు. మన దేశానికి జాతీయ భాష లేదనే విషయాన్ని ఎవరైనా ఆయనకు చెప్పండంటూ ఒకరు పోస్ట్ చేశారు. సంజయ్ క్షమాపణలు చెప్పాలంటూ మరొకరు డిమాండ్ చేశారు. క్రికెట్‌లో రాజకీయాలు ఎందుకంటూ ఇంకొకరు ప్రశ్నించారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఘనపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్లా రాజిరెడ్డి (50)కి రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. పంటల సాగుకు అందులో రెండు బోర్లు వేసినా పడలేదు. వ్యవసాయం లాభదాయకంగా లేదని పశువుల వ్యాపారం చేశారు. అందులోనూ నష్టాలు వచ్చి సుమారు రూ.5 లక్షల వరకు అప్పులయ్యాయి. వాటిని తీర్చే మార్గం కానరాకపోవడంతో శనివారం రాత్రి ఇంట్లో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. గమనించిన కుటుంబసభ్యులు సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ఇక్కడా విరాటే..

***–కివీస్‌పైనా కొనసాగిన జోరు***

***–మెరిసిన శుభ్‌మన్, శ్రేయస్***

***–తొలి వన్డేలో భారత్ విజయం***



కొన్నేళ్ల పాటు ఫామ్‌తో తంటాలు పడ్డాడు.. ఆత్మవిశ్వాసం సన్నగిల్లింది.. దూకుడు తగ్గింది.. టీ20ల నుంచి రిటైరయ్యాడు.. టెస్టులకూ టాటా చెప్పేశాడు.. ఇక వన్డేలకు కూడా గుడ్‌బై చెప్పడమే తరువాయి అనుకుంటున్న తరుణంలో ఈ ఫార్మాట్లో అనూహ్యంగా చెలరేగిపోతున్నాడు విరాట్ కోహ్లి. గత ఏడాది ఆస్ట్రేలియా పర్యటనలో మొదలైన అతడి పరుగుల ప్రవాహం నిరాటంకంగా సాగుతోంది. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లోనే మూడొందల పరుగులు సాధించిన కింగ్.. ఇప్పుడు న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో సెంచరీకి చేరువగా వెళ్లాడు. కోహ్లి మెరుపులకు శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హర్షిత్ రాణాల సమయోచిత ఇన్నింగ్స్‌లూ తోడవడంతో తొలి వన్డేలో నెగ్గి, మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది భారత్. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో టీమ్ఇండియా శుభారంభం చేసింది. ఆదివారం తొలి వన్డేలో శుభ్‌మన్ సేన 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట డరెల్ మిచెల్ (84; 71 బంతుల్లో 5×4, 3×6), హెన్రీ నికోల్స్ (62; 69 బంతుల్లో 8×4), డెవాన్ కాన్వే (56; 67 బంతుల్లో 6×4, 1×6) రాణించడంతో కివీస్ 8 వికెట్లకు 300 పరుగులు చేసింది. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్ (2/40) సత్తా చాటాడు. హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (93; 91 బంతుల్లో 8×4, 1×6) సూపర్ ఇన్నింగ్స్‌తో భారత్ లక్ష్యాన్ని 49 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. శుభ్‌మన్ గిల్ (56; 71 బంతుల్లో 3×4, 2×6), శ్రేయస్ అయ్యర్ (49; 47 బంతుల్లో 4×4, 1×6) రాణించారు. కోహ్లి ఉన్నంతసేపు సాఫీగా సాగుతున్న ఛేదన, అతడి నిష్క్రమణతో కాస్త ఇబ్బందిగా మారినప్పటికీ.. కేఎల్ రాహుల్ (29 నాటౌట్; 21 బంతుల్లో 2×4, 1×6), హర్షిత్ రాణా (29; 23 బంతుల్లో 2×4, 1×6) మెరుపులతో భారత్ గెలిచింది. కివీస్ పేసర్ కైల్ జేమీసన్ (101414) గొప్పగా బౌలింగ్ చేశాడు. రెండో వన్డే బుధవారం రాజ్‌కోట్‌లో జరుగుతుంది.

**––కోహ్లి ఇరుసులా..:** భారత్ ఛేదన కొంచెం నెమ్మదిగానే ఆరంభమైంది. జేమీసన్, ఫౌక్స్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 5 ఓవర్లలో టీమ్ఇండియా 15 పరుగులే చేసింది. కానీ తర్వాతి ఓవర్లో రోహిత్ (26; 29 బంతుల్లో 3×4, 2×6) సిక్సర్ బాది స్కోరు బోర్డును కదిలించాడు. జేమీసన్ వేసిన తర్వాతి ఓవర్లోనూ రోహిత్ సిక్సర్, ఫోర్ కొట్టాడు. అయితే ఊపుమీదున్న అతణ్ని 8వ ఓవర్లో జేమీసన్ ఔట్ చేశాడు. అయినా భారత్‌కు ఇబ్బంది లేకపోయింది. శుభ్‌మన్‌కు జత కలిసిన కోహ్లి.. ఆరంభం నుంచే చెలరేగి ఆడాడు. గిల్ ఆచితూచి ఆడుతుంటే.. కోహ్లి అలవోకగా బౌండరీలు కొడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. తొలి 20 బంతుల్లోనే అతను ఆరు ఫోర్లు కొట్టాడు. కుదురుకున్నాక గిల్ కూడా షాట్లకు దిగడంతో ఇన్నింగ్స్ సాఫీగా సాగిపోయింది. ముందుగా కోహ్లినే అర్ధశతకం సాధించగా.. తర్వాత గిల్ అతణ్ని అనుసరించాడు. కానీ 50 దాటగానే శుభ్‌మన్.. స్పిన్నర్ అశోక్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. గిల్‌తో రెండో వికెట్‌కు 118 పరుగులు జోడించిన విరాట్.. తర్వాత శ్రేయస్‌తో మూడో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యంతో జట్టును విజయానికి చేరువ చేశాడు.

గాయం కారణంగా రెండు నెలలకు పైగా ఆటకు దూరంగా ఉన్న శ్రేయస్.. ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేశాడు. కోహ్లి చకచకా సెంచరీకి చేరువయ్యాడు. 39 ఓవర్లకు 234/2తో భారత్ పటిష్ఠ స్థితికి చేరుకుంది. అప్పటికి కోహ్లి స్కోరు 93. సెంచరీ లాంఛనమే అనుకున్న దశలో అతను.. జేమీసన్ బౌలింగ్‌లో అనవసర షాట్‌కు ప్రయత్నించి ఔటయ్యాడు. లాంగాఫ్‌లో కెప్టెన్ బ్రేస్‌వెల్ చక్కటి డైవ్ క్యాచ్ అందుకోవడంతో స్టేడియాన్ని నిశ్శబ్దం ఆవహించింది. కోహ్లి వికెట్‌తో ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుదుపునకు లోనైంది. అదే ఓవర్లో జడేజా (4)ను కూడా జేమీసన్ ఔట్ చేశాడు. తన తర్వాతి ఓవర్లో జేమీసన్.. శ్రేయస్‌ను బౌల్డ్ చేసి భారత్‌కు మరో షాకిచ్చాడు. వికెట్లు పడడం, పరుగుల వేగం తగ్గడంతో భారత్ ఒత్తిడిలో పడింది. 6 ఓవర్లలో 44 పరుగులు చేయాల్సిన స్థితిలో కివీస్‌కూ గెలుపుపై ఆశలు రేగాయి. అయితే సుందర్ గాయపడడంతో ముందు బ్యాటింగ్‌కు వచ్చిన హర్షిత్ రాణా కొన్ని షాట్లు ఆడి భారత్‌పై ఒత్తిడి తగ్గించగా.. అతను ఔటయ్యాక రాహుల్ అందుకున్నాడు. క్లార్క్ వేసిన 49వ ఓవర్లో వరుసగా 4, 4, 6తో అతను మ్యాచ్‌ను ముగించాడు. మెరిసిన ఆ ముగ్గురూ..: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కివీస్.. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై ఇన్నింగ్స్‌ను ఆరంభించిన తీరు చూస్తే 330340 స్కోరు చేసేలా కనిపించింది. అయితే మధ్య ఓవర్లలో భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడమే కాక, కీలక వికెట్లు పడగొట్టడంతో స్కోరు వేగం తగ్గింది. అయితే ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచిన డరెల్ మిచెల్.. భారత బౌలర్లకు పైచేయి సాధించే అవకాశమివ్వలేదు. ఓపెనర్లు హెన్రీ నికోల్స్, డెవాన్ కాన్వే పట్టుదలతో క్రీజులో నిలవడంతో తొలి వికెట్ కోసం భారత్ చాలాసేపు ఎదురు చూడాల్సి వచ్చింది. కొత్త బంతితో మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా పొదుపుగా బౌలింగ్ చేయడంతో 9 ఓవర్లకు కివీస్ 40 పరుగులే చేయగలిగింది. అయితే అప్పటికే క్రీజులో కుదురుకున్న ఓపెనర్లు.. తర్వాత బ్యాట్లు ఝుళిపించారు. చేంజ్ బౌలర్‌గా వచ్చిన ప్రసిద్ధ్ వారిని ఇబ్బంది పెట్టలేకపోయాడు. నికోల్స్, కాన్వే.. సుందర్ వేసిన 20వ ఓవర్లో వరుస బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. అప్పటికే జట్టు స్కోరు 100 దాటింది.

హర్షిత్ రాణా వరుస ఓవర్లలో కివీస్ ఓపెనర్లను ఔట్ చేయడంతో భారత్ పోటీలోకి వచ్చింది. విల్ యంగ్ (12)ను సిరాజ్, ఫిలిప్స్ (12)ను కుల్‌దీప్ పెవిలియన్ చేర్చడం.. మధ్య ఓవర్లలో స్కోరు వేగం కూడా పడిపోవడంతో కివీస్ ఇబ్బందుల్లో పడింది. 36 ఓవర్లకు స్కోరు 186/4. అయితే అప్పటికే క్రీజులో పాతుకుపోయిన మిచెల్.. భారీ షాట్లకు దిగడంతో స్కోరు వేగం పెరిగింది. మరో ఎండ్‌లో వికెట్లు పడుతున్నా అతను మాత్రం ఆగలేదు. ప్రసిద్ధ్ వేసిన 48వ ఓవర్లో 4, 6, 4 బాదిన మిచెల్.. సెంచరీకి చేరువగా వచ్చాడు. జట్టు స్కోరునూ 300కు దగ్గర చేశాడు. అయితే తర్వాతి బంతికి ప్రసిద్ధ్.. వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. క్రిస్టియన్ క్లార్క్ (24 నాటౌట్) పోరాటంతో కివీస్ 300 మార్కును అందుకుంది. 8 ఓవర్లలో 40 పరుగులే ఇచ్చి 2 వికెట్లు తీసిన సిరాజ్‌తో కెప్టెన్ శుభ్‌మన్ పూర్తి కోటా వేయించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. హర్షిత్, ప్రసిద్ధ్ కూడా తలో రెండు వికెట్లు తీసినా.. ఎక్కువ పరుగులిచ్చేశారు.

**––న్యూజిలాండ్ ఇన్నింగ్స్....** డెవాన్ కాన్వే (బి) హర్షిత్ రాణా 56; హెన్రీ నికోల్స్ (సి) రాహుల్ (బి) హర్షిత్ రాణా 62; విల్ యంగ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 12; డరెల్ మిచెల్ ఎల్బీ (బి) ప్రసిద్ధ్ కృష్ణ 84; గ్లెన్ ఫిలిప్స్ (సి) అయ్యర్ (బి) కుల్‌దీప్ యాదవ్ 12; మిచెల్ హే (బి) ప్రసిద్ధ్ కృష్ణ 18; బ్రేస్‌వెల్ రనౌట్ 16; జాక్ ఫౌక్స్ (బి) సిరాజ్ 1; క్రిస్టియన్ క్లార్క్ నాటౌట్ 24; కైల్ జేమీసన్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 7 మొత్తం: (50 ఓవర్లలో 8 వికెట్లకు) 300; వికెట్ల పతనం: 1117, 2126, 3146, 4170, 5198, 6237, 7239, 8281; బౌలింగ్: సిరాజ్ 80402; హర్షిత్ రాణా 100652; సుందర్ 50270; ప్రసిద్ధ్ కృష్ణ 90602; కుల్‌దీప్ యాదవ్ 90521; జడేజా 90560

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) బ్రేస్‌వెల్ (బి) జేమీసన్ 26; శుభ్‌మన్ గిల్ (సి) ఫిలిప్స్ (బి) అశోక్ 56; విరాట్ కోహ్లి (సి) బ్రేస్‌వెల్ (బి) జేమీసన్ 93; శ్రేయస్ అయ్యర్ (బి) జేమీసన్ 49; రవీంద్ర జడేజా (సి) క్లార్క్ (బి) జేమీసన్ 4; రాహుల్ నాటౌట్ 29; హర్షిత్ రాణా (సి) మిచెల్ హే (బి) క్లార్క్ 29; వాషింగ్టన్ సుందర్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 13 మొత్తం: (49 ఓవర్లలో 6 వికెట్లకు) 306; వికెట్ల పతనం: 139, 2157, 3234, 4239, 5242, 6279; బౌలింగ్: జేమీసన్ 101414, జాక్ ఫౌక్స్ 100490, ఆదిత్య 60551, క్రిస్టియన్ క్లార్క్ 100731, బ్రేస్‌వెల్ 80560, ఫిలిప్స్ 40210, మిచెల్ 1070

అంతర్జాతీయ క్రికెట్లో అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యంత వేగంగా 28 వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా విరాట్ కోహ్లి ఘనత సాధించాడు. న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో స్పిన్నర్ ఆదిత్య అశోక్ బౌలింగ్‌లో బౌండరీతో అతడు ఈ మైలురాయిని అందుకున్నాడు. రికార్డుకు 25 పరుగుల దూరంలో ఉండగా క్రీజులోకి వచ్చిన కోహ్లి.. అలవోకగా పని పూర్తి చేశాడు. కెరీర్‌లో అతడికి ఇది 624వ ఇన్నింగ్స్. సచిన్ 644 ఇన్నింగ్స్‌లో 28 వేల పరుగులు పూర్తి చేశాడు. కోహ్లి, సచిన్ కాకుండా శ్రీలంక దిగ్గజం సంగక్కర మాత్రమే అంతర్జాతీయ క్రికెట్లో (666 ఇన్నింగ్స్) ఆ మైలురాయిని అందుకున్నాడు. అన్ని ఫార్మాట్లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో సచిన్ (34,357) తర్వాత కోహ్లి (28,068) రెండో స్థానంలో ఉన్నాడు. సంగక్కర (28,016)ది మూడో స్థానం. న్యూజిలాండ్‌తో వన్డేల ముంగిట ప్రాక్టీస్‌లో గాయపడి వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ సిరీస్ మొత్తానికి దూరం కాగా.. తొలి వన్డే మధ్యలో వాషింగ్టన్ సుందర్ మైదానాన్ని వీడాడు. ఈ మ్యాచ్‌లో పొదుపుగా బౌలింగ్ చేసిన సుందర్.. 5 ఓవర్లలో 27 పరుగులే ఇచ్చాడు. అయితే అయిదో ఓవర్ అనంతరం వెన్ను నొప్పితో ఇబ్బంది పడ్డాడు. నొప్పి ఎక్కువగా ఉండడంతో అతను తర్వాత మైదానాన్ని వీడాడు. మళ్లీ తిరిగి రాలేదు. అతడి స్థానంలో నితీశ్ కుమార్ రెడ్డి ఫీల్డింగ్ చేశాడు. అయితే బ్యాటింగ్‌లో తన అవసరం పడడంతో సుందర్ ఆరో వికెట్ పడ్డాక క్రీజులోకి వచ్చాడు. ఇబ్బంది పడుతూనే బ్యాటింగ్ చేశాడు. రాహుల్‌కు అండగా నిలిచి జట్టు విజయాన్ని పూర్తి చేశాడు.

**–––పంత్ స్థానంలో జురెల్ ....** న్యూజిలాండ్‌తో తొలి వన్డేకు ముందు ప్రాక్టీస్ చేస్తుండగా గాయపడి సిరీస్ మొత్తానికి దూరమైన వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ స్థానంలో.. ధ్రువ్ జురెల్ భారత జట్టులోకి వచ్చాడు. విజయ్ హజారే ట్రోఫీలో జురెల్ భీకర



# డివైన్ దంచేసింది..

**–ఉత్కంఠపోరులో దిల్లీపై గుజరాత్ విజయం**



బాదుడు పోటీలో గుజరాత్ టైటాన్స్ నిలిచింది. సోఫీ డివైన్ ఆల్‌రౌండ్ జోరుతో అదరగొట్టిన వేళ.. ఉత్కంఠభరిత పోరులో దిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. గెలుపు ముంగిట దిల్లీ తడబడింది. ఆ జట్టుకిది వరుసగా రెండో ఓటమి. వరుసగా రెండు విజయాలతో పాయింట్ల పట్టికలో టైటాన్స్ అగ్రస్థానంలో ఉంది.

**––నవీ ముంబయి......** ుజరాత్ టైటాన్స్ అదరగొట్టింది. ఆదివారం భారీ స్కోర్ల మ్యాచ్‌లో ఆ జట్టు 4 పరుగుల తేడాతో దిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. సోఫీ డివైన్ (95; 42 బంతుల్లో 7×4, 8×6) రెచ్చిపోవడంతో మొదట గుజరాత్ భారీ స్కోరు సాధించింది. 20 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. గార్డ్‌నర్ (49) రాణించింది. నందని శర్మ (5/33) హ్యాట్రిక్ సాధించింది. ఛేదనలో దిల్లీ 5 వికెట్లకు 205 పరుగులే చేయగలిగింది. లిజెలీ లీ (86; 54 బంతుల్లో 12×4, 3×6), వోల్వార్ట్ (77; 38 బంతుల్లో 9×4, 3×6)ల శ్రమ వృథా అయింది. డివైన్ (2/21) ఆఖర్లో అద్భుత బౌలింగ్‌తో దిల్లీ ఆశలపై నీళ్లు చల్లింది.

**––లిజెలీ, వోల్వార్ట్ పోరాడినా..:** లక్ష్యం చాలా పెద్దదే. కానీ ఓపెనర్ లిజెలీ లీ విరుచుకుపడడంతో ఛేదనలో వడివడిగా లక్ష్యం దిశగా సాగింది దిల్లీ క్యాపిటల్స్. రేణుక సింగ్ వేసిన ఇన్నింగ్స్ మొదటి ఓవర్లో ఫోర్, సిక్స్ బాదాక లిజెలీ కాస్త సమయం తీసుకుంది. పవర్‌ప్లే ముగిసేసరికి షెఫాలి (14) వికెట్ కోల్పోయిన దిల్లీ.. 47/1తో నిలిచింది. ఆ తర్వాత లిజెలీ చెలరేగిపోయింది. వేర్‌హామ్ బౌలింగ్‌లో వరుసగా 4, 4, 6 కొట్టిన ఆమె, 33 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసింది. అయితే మరోవైపు వోల్వార్ట్ అంత దూకుడుగా ఆడలేకపోవడంతో సాధించాల్సిన రన్‌రేట్ క్రమంగా పెరిగింది. 15వ ఓవర్లో లిజెలీని కష్వీ ఔట్ చేసేటప్పటికి దిల్లీ స్కోరు 131. లిజెలీ.. వోల్వార్ట్‌తో రెండో వికెట్‌కు 90 పరుగులు జోడించింది. ఆఖరి అయిదు ఓవర్లలో దిల్లీకి 77 పరుగులు అవసరమయ్యాయి. కానీ షినెలీ ఔటైనా.. వోల్వార్ట్ విధ్వంసంతో 19 ఓవర్లలో 203/3తో నిలిచింది దిల్లీ. 18వ ఓవర్లో 19.. 19వ ఓవర్లో 22 పరుగులు వచ్చాయి. వోల్వార్ట్‌తో పాటు జెమీమా (15) క్రీజులో ఉండగా.. ఆఖరి ఓవర్లో కేవలం 7 పరుగులు చేయాల్సిన స్థితిలో దిల్లీ గెలుపు ఖాయమనిపించింది. కానీ సోఫీ డివైన్ (2/21) బంతితోనూ గొప్పగా రాణించింది. 20వ ఓవర్లో అద్భుతంగా బౌలింగ్ చేసింది. కేవలం 2 పరుగులే ఇచ్చిన ఆమె.. జెమీమా, వోల్వార్ట్‌లను ఔట్ చేయడం ద్వారా గుజరాత్‌కు అనూహ్య విజయాన్నందించింది.

ఆమె దూకుడు: గుజరాత్ మొదట అంత పెద్ద స్కోరు చేసిందంటే కారణం ఓపెనర్ సోఫీ డివైన్ విధ్వంసమే. చెలరేగి ఆడిన ఆమె.. సిక్స్‌లు, ఫోర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. బెత్ మూనీ (19)తో తొలి వికెట్‌కు 94, ఆష్లీ గార్డ్‌నర్ (49; 26 బంతుల్లో 4×4, 3×6)తో రెండో వికెట్‌కు 32 పరుగులు జోడించి ఔటైంది.డివైన్ నిష్క్రమించాక గుజరాత్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయినప్పటికీ.. గార్డ్‌నర్ చెలరేగడంతో స్కోరు 200 దాటింది.

**–––స్నేహ్ ఓవర్లో 32.....** దిల్లీ స్పిన్నర్ స్నేహ్ రాణా కోరుకోని రికార్డును సొంతం చేసుకుంది. డబ్ల్యూపీఎల్ చరిత్రలో ఒక ఓవర్లో అత్యధిక పరుగులిచ్చిన బౌలర్‌గా ఆమె నిలిచింది. గుజరాత్ ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో ఆమె ఏకంగా 32 పరుగులు సమర్పించుకుంది. స్నేహ్ బౌలింగ్‌లో.. సోఫీ డివైన్ వరుసగా 4, 4, 6, 6, 6, 6 దంచేసింది. ఇప్పటివరకు దీప్తి శర్మ (28) ఒక ఓవర్లో అత్యధిక పరుగులిచ్చిన బౌలర్‌గా ఉంది.

**––గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్...:** బెత్ మూనీ (సి) అండ్ (బి) శ్రీచరణి 19; సోఫీ డివైన్ (సి) శ్రీచరణి (బి) నందని 95; గార్డ్‌నర్ (సి) వోల్వార్ట్ (బి) షినెలీ 49; వేర్‌హామ్ (సి) జెమీమా (బి) శ్రీచరణి 3; అనుష్క శర్మ (సి) నందని (బి) షెఫాలి వర్మ 13; భార్తీ ఫుల్మాలి (సి) వోల్వార్ట్ (బి) హెన్రీ 3; కష్వీ గౌతమ్ (సి) షినెలీ (బి) నందని 14; కనిక (స్టంప్డ్) లీ (బి) నందని 4; తనూజ కన్వర్ నాటౌట్ 1; రాజేశ్వరి (బి) నందని 0; రేణుక (బి) నందని 0; ఎక్స్‌ట్రాలు 8 మొత్తం: (20 ఓవర్లలో ఆలౌట్) 209; వికెట్ల పతనం: 194, 2126, 3129, 4151, 5165, 6201, 7208, 8209, 9209; బౌలింగ్: మరిజేన్ కాప్ 40250; షినెలీ 40432; నందని శర్మ 40335; స్నేహ్ 10320; శ్రీచరణి 40422; షెఫాలి 20211; మిన్ను మణి 10130.

**––దిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్...:** లిజెలీ లీ (సి) డివైన్ (బి) కష్వీ 86; షెఫాలి వర్మ (బి) రాజేశ్వరి 14; లారా వోల్వార్ట్ (సి) వేర్‌హామ్ (బి) డివైన్ 77; షినెల్ హెన్రీ (సి) గార్డ్‌నర్ (బి) రాజేశ్వరి 7; జెమీమా (సి) మూనీ (బి) డివైన్ 15; కాప్ నాటౌట్ 1; స్నేహ్ రాణా నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 5 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 205; వికెట్ల పతనం: 141, 2131, 3146, 4204, 5205; బౌలింగ్: రేణుక సింగ్ 20170; కష్వీ 40481; సోఫీ డివైన్ 30212; రాజేశ్వరి 40342; వేర్‌హామ్ 20300; తనూజ 30270; గార్డ్‌నర్ 20280

..........................................